# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

WWW.PRAJAVOICE.IN

సంపుటి: 02 | సంచిక: 67 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 25-09-2026 | పేజీలు: 10






## సిరా చుక్క

బాల్యం బతకాలి
బాల్యం ఎక్కడుంది.
పుస్తకాల బరువులో నలిగిపోతుందా.!
చదువు ఎక్కడుంది.
ర్యాంకుల పరుగులో
కనుమరుగవుతుందా.!
ఆడాల్సిన చేతుల్లో
పరీక్షల పేపర్లు ఎందుకు..?
పరుగెత్తాల్సిన కాళ్లకు...
పోటీ సంకెళ్లు ఎందుకు..?
పిల్లవాడు ర్యాంకు కాదు,
రేపటి సమాజ నిర్మాత
పిల్లవాడు మార్కు కాదు,
మమతతో నిండిన మనిషి
చదువు హక్కు ధనికుడి సొత్తు కాదు..
పాఠశాల హక్కు
వ్యాపారానికి వస్తువు కాదు
ప్రశ్నించే గొంతులను భయంతో
మూయించకండి
కలలు కనే కళ్లను ఒత్తిడితో ఆర్పకండి
పుస్తకం ఇవ్వండి
కానీ బాల్యాన్ని లాక్కోకండి
చదువు సాగాలి...
బాల్యం బతకాలి...ప్రతి బిడ్డ నవ్వాలి

కోటియ భూక్యా...
కోదాడ, సూర్యాపేట జిల్లా...




# ఆర్యదాన్ మహమ్మద్-2026

# పురస్కారానికి సీఎం రేవంత్ రెడ్డి.!

- రైతులు, బీసీలు, సామాన్యుల సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు
- బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు రేవంత్ రెడ్డి ఎంపిక
- ప్రజాస్వామిక విలువలపై నిబద్ధతను ప్రశంసించిన జ్యూరీ
- శుక్రవారం నిలంబూరులో పురస్కారం ప్రదానం
- దివంగత నేత ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం అవార్డు ఏర్పాటు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక ఆర్యదాన్ మహమ్మద్-2026 పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ ఏడాది ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారాన్ని ఆయన అందుకోనున్నారు. శుక్రవారం కేరళలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో నిర్వాహకులు సీఎం రేవంత్ రెడ్డికి ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

**సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు**

రేవంత్ రెడ్డి పాలనలో రైతులు, బీసీలు, సామాన్య పౌరుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు అవార్డు నిర్వాహకుల జ్యూరీ వెల్లడించింది. ప్రజలకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడంలో ఆయన తీసుకున్న చర్యలను జ్యూరీ గుర్తించింది.

**ప్రజాస్వామిక విలువలపై ప్రశంసలు**

ప్రజాస్వామిక విలువల పట్ల సీఎం రేవంత్ రెడ్డి చూపుతున్న నిబద్ధతను జ్యూరీ ప్రశంసించింది. దివంగత కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

**ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం**

కేరళలో కాంగ్రెస్ పార్టీకి చెందిన దివంగత సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు.

ప్రతి ఏడాది ప్రజాసేవలో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి ఈ అవార్డును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# ఫిరాయింపుల రాజకీయాలకు చరమగీతం పాడాలి.! : బండి సంజయ్

- పార్టీ మారడం నైతికతకే మచ్చ అంటూ బండి సంజయ్ విమర్శలు
- దానం నాగేందర్ వ్యవహారంపై తీర్పును వక్రీకరిస్తున్నారంటూ ఆరోపణ
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై తీవ్రస్థాయిలో విమర్శలు
- ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమని వ్యాఖ్య
- ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలోకి ఫిరాయించడం నైతికతకే మచ్చ అని కేంద్ర మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ విమర్శించారు. తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఫిరాయింపుల రాజకీయాలపై

మిగతా 2లో

# దానం నాగేందర్‌కు సుప్రీంలో షాక్.. పిటిషన్ కొట్టివేత.!

- దానం పిటిషన్‌పై విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టీకరణ
- మరో పార్టీ టికెట్‌పై పోటీ చేయడం పార్టీని వీడినట్లేనని వ్యాఖ్య
- తిరిగి సొంత పార్టీలో చేరినా అనర్హత తొలగదని స్పష్టీకరణ
- మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సిందేనని ధర్మాసనం అభిప్రాయం



**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గురువారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. దానం నాగేందర్ తరఫున సీనియర్ కౌన్సిల్ ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. అయితే పిటిషన్‌పై విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు.. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది.

**మరో పార్టీ టికెట్‌పై పోటీ చేస్తే పార్టీ వీడినట్లే**

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోయినా, అధికారికంగా రాజీనామా పత్రం సమర్పించకపోయినా.. మరో రాజకీయ పార్టీ టికెట్‌పై నామినేషన్ వేసి పోటీ చేయడం రాజ్యాంగబద్ధంగా పార్టీని వీడినట్లేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వ్యక్తిగతంగా మరో పార్టీలో చేరడం మాత్రమే సమస్య కాదని.. చట్టసభ సభ్యత్వంతో పాటు ఫిరాయింపుకు పాల్పడటం తప్పేనని ధర్మాసనం పేర్కొంది.

**స్పీకర్ నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుంది**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్

మిగతా 2లో

# యాదాద్రి థర్మల్‌పై రగిలిన 'పవర్' పాలిటిక్స్

- ప్లాంట్ వద్ద బీఆర్ఎస్ భారీ ధర్నా
- నేతలను అడ్డుకున్న పోలీసులు
- బొగ్గు ఉంది.. సామర్థ్యం ఉంది
- విద్యుత్ ఉత్పత్తి ఎందుకు చేయడం లేదు?
- రైతులకు 24 గంటల విద్యుత్
- రెండు పంటలకు సాగునీరు విడుదల చేయాలి
- స్థానికులకు, నిర్వాసితులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

2 లో



# దానం నాగేందర్ కేసులో సుప్రీం తీర్పుపై కిషన్ రెడ్డి హర్షం.!

- పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై తీర్పు గుణపాఠమన్న కిషన్ రెడ్డి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫిరాయింపు రాజకీయాలకు హెచ్చరిక అని వ్యాఖ్య
- దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యమని వెల్లడి
- రెండు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారని వ్యాఖ్య
- ఉప ఎన్నికలో బీజేపీ విజయం ఖాయమని కిషన్ రెడ్డి ధీమా



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు గుణపాఠమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మేరకు కిషన్ రెడ్డి కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది.

**ఫిరాయింపులపై రెండు పార్టీలను విమర్శిస్తూ**

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని గత ప్రభుత్వం చట్టవ్యతిరేకంగా మంత్రిపదవులు ఇచ్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుని సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయించిందని గుర్తుచేశారు.

మిగతా 2లో

# బ్యాంకు ఖాతాల వినియోగానికి ఐబొమ్మ రవికి కోర్టు అనుమతి.!

- సీజ్ చేసిన బ్యాంకు ఖాతాలను లావాదేవీల కోసం ఉపయోగించుకోవచ్చని ఆదేశం
- ఖాతాల్లోని రూ.3 కోట్ల నగదు అన్‌ఫ్రీజ్‌కు నిరాకరణ
- కుటుంబ పోషణకు ఇబ్బందులు అంటూ రవి పిటిషన్
- గత నవంబర్‌లో అరెస్టు.. ఫిబ్రవరిలో బెయిల్
- పైరసీ, బెట్టింగ్ యాప్‌ల ప్రచారంపై రవిపై ఆరోపణలు




# సజ్జనార్ ఎక్కడున్నా వదలం..

# సప్తసముద్రాలు దాటినా పట్టుకొస్తాం.!: కౌశిక్ రెడ్డి

- గణేష్ నిమజ్జనాల్లో కేసీఆర్ పాటలపై హెచ్చరికలపై కౌశిక్ రెడ్డి ఆగ్రహం
- రాజకీయ పాటలపై చెప్పడానికి పోలీసు అధికారులు ఎవరని ప్రశ్న
- బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే సజ్జనార్‌ను వదిలిపెట్టబోమని వ్యాఖ్య
- నిమజ్జన ఏర్పాట్లలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడుతుందని వ్యాఖ్య



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గణేష్ నిమజ్జన ఊరేగింపుల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటల విష యంలో సీపీ చేసిన హెచ్చరికలపై ఆయన స్పందిం చారు. కేసీఆర్ పాటలు పెట్టొద్దని చెప్పడానికి సజ్జనార్ ఎవరని ప్రశ్నించారు. పోలీసు అధికారులు రాజకీయ నాయకుల తరహాలో మాట్లాడటం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కౌశిక్ రెడ్డి గురువారం తెలం గాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో చేశారు.

**సజ్జనార్‌పై తీవ్ర హెచ్చరికలు**

గణేష్ నిమజ్జనాల్లో కేసీఆర్ పాటలు పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. నిమజ్జనాల్లో ఏ పాటలు పెట్టుకోవాలో నిర్ణయించేందుకు పోలీసు అధికారులు ఎవరని ప్రశ్నించారు. కేసీఆర్‌పై వ్యాఖ్యలు చేయడానికి సీపీ సజ్జనార్ ఎవరంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు పోలీసులుగా తమ విధులు నిర్వర్తించాలే తప్ప రాజకీయ నాయకుల మాదిరిగా వ్యవహరించకూడదని అన్నారు.

**'సప్తసముద్రాలు దాటినా వదలం'**

మరో రెండేళ్లలో పదవీ విరమణ చేయబోతున్నానని సజ్జనార్ భావిస్తున్నారేమోనని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తిరిగి తెలంగాణలో అధికారంలోకి వస్తుందని, ఆ తర్వాత సజ్జనార్ ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సప్తసముద్రాలు దాటినా పట్టుకొస్తామని వ్యాఖ్యానించారు. పోలీసు అధికారులు ఎవరూ తమ హద్దులు దాటి వ్యవహరించవద్దని సూచించారు.

**నిమజ్జన ఏర్పాట్లపై ప్రభుత్వంపై విమర్శలు**

గణేష్ నిమజ్జనానికి అవసరమైన నీటి వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కౌశిక్ రెడ్డి ఆరోపించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో నిమజ్జన ఏర్పాట్ల కోసం మంత్రులు, అధికారులను కోరినా స్పందన రాలేదని తెలిపారు. సరైన ఏర్పాట్లు లేక కొన్ని ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలను ముక్కలు చేసి నిమజ్జనం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. దీనిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**పార్టీ ఫిరాయింపులపై కీలక వ్యాఖ్యలు**

ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపైనా కౌశిక్ రెడ్డి స్పందించారు. పార్టీ మారిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ ఇదే తరహా పరిణామాలు చోటుచేసుకుంటాయని అన్నారు. దానం నాగేందర్ అనర్హత కోసం బీఆర్ఎస్ న్యాయ విభాగం చాలాకాలంగా న్యాయపోరాటం చేస్తోందని తెలిపారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బ్యూరో.!

- టీజీ టీఎంపీఆర్ఎస్ ఏర్పాటు
- రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రతపై ప్రత్యేక పర్యవేక్షణ
- ఏడీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారికి డైరెక్టర్ బాధ్యతలు
- హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఓఆర్ఆర్‌పై ప్రత్యేక పెట్రోలింగ్
- ప్రతి పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాద స్పందన అధికారి నియామకం
- ట్రాఫిక్ విభాగం నుంచి 300 పోస్టులు కొత్త బ్యూరోకు బదిలీ

2 లో



# యాదాద్రి థర్మల్‌పై రగిలిన 'పవర్' పాలిటిక్స్



**ప్రజా వాయిస్ డెస్క్,హైదరాబాద్.**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కేంద్రంగా 'పవర్ పాలిటిక్స్' వేడెక్కింది. రైతులకు వ్యవసాయ అవసరాలకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రెండు పంటలకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సూచనతో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

### ప్లాంట్ లోకి వెళ్లేందుకు యత్నం.. అడ్డుకున్న పోలీసులు

ధర్నా అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్లాంట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా బలగాలను మోహరించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. నేతలను అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అనంతరం మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ప్లాంట్‌లోకి వెళ్లి చీఫ్ ఇంజినీర్‌ను కలిశారు. విద్యుత్ ఉత్పత్తి పరిస్థితి, ప్లాంట్ సామర్థ్యం, బొగ్గు సరఫరా తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### బొగ్గు ఉంది.. సామర్థ్యం ఉంది.. కరెంట్ ఎందుకు లేదు.

ప్లాంట్ పరిశీలన అనంతరం జగదీష్‌రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యం ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో ఉత్పత్తి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. బొగ్గు లభ్యత, ప్లాంట్ సామర్థ్యంపై కేంద్ర బొగ్గు శాఖ ఉత్తర్వులు, సింగరేణి నివేదికలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

### మళ్లీ విద్యుత్ కష్టాలా

తెలంగాణలో 2014కు ముందు ఉన్న విద్యుత్ సమస్యలు మళ్లీ కనిపిస్తున్నాయని జగదీష్‌రెడ్డి ఆరోపించారు. రైతులు విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్నారని, పరిశ్రమలు జనరేటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరిగినప్పటికీ ఇలాంటి పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### 6,700 నుంచి 21,500 మెగావాట్లకు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో సుమారు 6,700 మెగావాట్లుగా ఉన్న విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 నాటికి గణనీయంగా పెంచిందని జగదీష్‌రెడ్డి తెలిపారు. పూర్తయిన ప్రాజెక్టులతో కలిపి రాష్ట్రంలో సుమారు 21,500 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యం ఉందని పేర్కొన్నారు. ఇంతటి సామర్థ్యం ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎందుకు తలెత్తుతున్నాయని ప్రశ్నించారు.




### బొగ్గు సరఫరాపై భిన్న వాదనలు

యాదాద్రి ప్లాంట్‌కు బొగ్గు సరఫరా అంశం ప్రధాన వివాదంగా మారింది. బొగ్గు కొరత కారణంగానే ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటుండగా.. బొగ్గు అందుబాటులో ఉన్నప్పటికీ సరఫరా, నిర్వహణలో లోపాల కారణంగానే సమస్యలు తలెత్తుతున్నాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును నిరంతరాయంగా సరఫరా చేసి పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేయాలని డిమాండ్ చేశారు.

### సింగరేణి బొగ్గు తెలంగాణకే..

సింగరేణిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గును రాష్ట్రంలోని విద్యుత్ అవసరాలకు ప్రాధాన్యతగా వినియోగించాలని జగదీష్‌రెడ్డి కోరారు. తెలంగాణలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### రైతుకు కరెంట్.. పంటకు నీరు

రైతాంగానికి 24 గంటల విద్యుత్ సరఫరా కొనసాగించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. సాగు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. రెండు పంటలకు అవసరమైన సాగునీటిని వెంటనే విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

### నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలి

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులు, స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని జగదీష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, ఇతర సిబ్బందిలో స్థానికుల వివరాలను పరిశీలించాలని కోరారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు.

### భాస్కర్ రావు ఏమన్నారంటే..

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం బొగ్గు సరఫరాపై తగిన చర్యలు తీసుకోకపోవడంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని ఆరోపించారు. రైతులకు సాగు సమయంలో నిరంతర విద్యుత్, రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

### రాజకీయ వేడికి కేంద్రంగా యాదాద్రి

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, ప్లాంట్ నిర్వహణ, రైతులకు విద్యుత్, సాగునీరు, స్థానిక ఉద్యోగాలు ఇప్పుడు రాజకీయ వివాదానికి కేంద్రంగా మారాయి. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఆందోళనకు దిగగా.. ప్రభుత్వం మాత్రం బొగ్గు సరఫరా సమస్యలను అధిగమించి ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెబుతోంది.ఈ నేపథ్యంలో యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుంది.. పూర్తి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది..రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు ఎప్పుడు అందుతాయి.. అన్న అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామావత్ రవీంద్రకుమార్ నాయక్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పన విజయసింహారెడ్డి,కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, పైళ్ల శేఖర్‌రెడ్డి, గాదరి కిషోర్, ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఖాతాల వినియోగానికి ఐబొమ్మ రవికి కోర్టు అనుమతి.!

**ప్రజా వాయిస్, హైదరాబాద్:**ఐబొమ్మ ఇమ్మడి రవికి నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. పోలీసులు సీజ్ చేసిన తన బ్యాంకు ఖాతాలను వ్యక్తిగత లావాదేవీల కోసం ఉపయోగించుకునేందుకు న్యాయస్థానం అనుమతించింది. ఖాతాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని పోలీసులను ఆదేశించింది. అయితే ఆ ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన రూ.3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేసేందుకు మాత్రం కోర్టు నిరాకరించింది.

### రూ.3 కోట్ల నగదుకు నో

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా ఉందని పేర్కొంటూ ఇమ్మడి రవి ఎనిమిది రోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తన బ్యాంకు ఖాతాల్లో నిలిపివేసిన రూ.3 కోట్లను వినియోగించుకునేలా పోలీసులను ఆదేశించాలని కోరాడు. అయితే నగదును అన్‌ఫ్రీజ్ చేసేందుకు కోర్టు అంగీకరించలేదు. బ్యాంకు ఖాతాలను మాత్రం ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చింది.

### పైరసీ, బెట్టింగ్ యాప్‌లపై ఆరోపణలు

పైరసీకి పాల్పడి సినిమా పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించడంతో పాటు, బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసి కోట్ల రూపాయలు సంపాదించాడన్న ఆరోపణలపై హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు గత నవంబర్‌లో ఇమ్మడి రవిని అరెస్టు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయనకు బెయిల్ లభించింది.

### అరెస్టు సమయంలో ఖాతాలు సీజ్

అరెస్టు సమయంలో పోలీసులు తన బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసి రూ.3 కోట్ల నగదును నిలిపివేశారని రవి తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఆ నగదును తిరిగి వినియోగించుకునేందుకు అనుమతించాలని నాంపల్లిలోని 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టును కోరాడు. అయితే న్యాయస్థానం ఖాతాల వినియోగానికి మాత్రమే అనుమతి ఇచ్చి, ఖాతాల్లోని రూ.3 కోట్ల నగదును అన్‌ఫ్రీజ్ చేయడానికి నిరాకరించింది.

# ఫిరాయింపుల రాజకీయాలకు చరమగీతం పాడాలి.! : బండి సంజయ్

మొదటి పేజీ తరువాయి

ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలకు సిగ్గు రాలేదని వ్యాఖ్యానించారు. ఆయా రామ్, గయా రామ్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు.

### తీర్పును వక్రీకరిస్తున్నారంటూ ఆరోపణ

దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పులోని వాస్తవాలను కప్పిపుచ్చి కొన్ని మీడియా సంస్థలు తీర్పును వక్రీకరిస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ఫిరాయింపుల రాజకీయాలను సమర్థిస్తూ ఎవరికి వారే ఈ పరిణామాన్ని తమ విజయంగా చెప్పుకోవడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ఈ తీర్పు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెంపపెట్టు వంటిదని వ్యాఖ్యానించారు.

### ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యం

ఫిరాయింపుల రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమని పేర్కొన్నారు. నైతికతను మంటకలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఆ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని ఆయన వ్యాఖ్యానించారు.

### ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపు

ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాజకీయంగా నిమజ్జనం చేయాలని హిందూ బంధువులు, ప్రజలకు బండి సంజయ్ పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కూడా ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడకుండా ప్రజలే గట్టి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ ఎన్నికల ద్వారా ఫిరాయింపుల రాజకీయాలకు వ్యతిరేకంగా బలమైన సంకేతాలు పంపాలని విజ్ఞప్తి చేశారు.

# క్షుద్ర పూజల ప్రచారంపై హరీశ్ రావు ఫైర్..

- కాంగ్రెస్ నేతలపై కేసు.!
- తప్పుడు ప్రచారంపై మహేశ్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై పరువు నష్టం కేసు
- సెప్టెంబర్ 30న తన వాంగ్మూలం నమోదు చేయనున్న కోర్టు
- కాంగ్రెస్‌ది డైవర్షన్ పాలిటిక్స్ అంటూ హరీశ్ రావు విమర్శలు
- పార్టీ మారిన ఎమ్మెల్యేలంతా రాజీనామా చేయాలని డిమాండ్
- దానం నాగేందర్ తీర్పు రేవంత్‌కు చెంపపెట్టు అంటూ వ్యాఖ్యలు



**ప్రజా వాయిస్, హైదరాబాద్:**తనపై క్షుద్ర పూజలు చేశానంటూ కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై అన్ని సాక్ష్యాధారాలతో పరువు నష్టం కేసు దాఖలు చేసినట్లు తెలిపారు. గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. తన పిటిషన్‌ను కోర్టు అనుమతించిందని, సెప్టెంబర్ 30న తన వాంగ్మూలాన్ని నమోదు చేస్తామని కోర్టు స్పష్టం చేసిందని వెల్లడించారు.

### తప్పుడు ప్రచారంపై కేసు

తనపై అసత్య ప్రచారాలు చేస్తున్న మహేశ్ కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కేసు దాఖలు చేసినట్లు హరీశ్ రావు తెలిపారు. భవిష్యత్తులోనూ తనపై అబద్దాలు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అబద్ధాలు చెప్పడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు.

### ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నలు

ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు ఏమైందని హరీశ్ రావు కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. ప్రజా సమస్యలపై సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా డిప్యూటీ స్పీకర్‌ను నియమించలేదని విమర్శించారు. సభా హక్కుల ఉల్లంఘనపై నోటీసులు ఇచ్చినా స్పీకర్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై డిమాండ్

దానం నాగేందర్ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు వంటిదని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించాలని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని డిమాండ్ చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలందరికీ దానం నాగేందర్ వ్యవహారంలో వెలువడిన తీర్పు ఎదురవుతుందని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడేందుకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రయత్నించారని ఆరోపిస్తూ.. వారంతా రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు.

# దానం నాగేందర్‌కు సుప్రీంలో షాక్.. పిటిషన్ కొట్టివేత.!

మొదటి పేజీ తరువాయి

నిర్ణయం న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది. మరో పార్టీ బీ-ఫారమ్‌పై పోటీ చేయడం వంటి సుస్పష్టమైన ఆధారాలు ఉన్నప్పుడు స్పీకర్ చర్య తీసుకోకపోవడం రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుందని ధర్మాసనం పేర్కొంది. దానం నాగేందర్‌పై అనర్హత వేటు పడిన నేపథ్యంలో మళ్లీ ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని అభిప్రాయపడింది.

### 'ఘర్ వాపసీ' వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం

దానం నాగేందర్ తిరిగి తన సొంత పార్టీలో చేరి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఆయనపై పార్టీ నుంచి ఎలాంటి ఫిర్యాదు లేదని ముకుల్ రోహత్గీ వాదించారు. అయితే పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడం, చట్టసభ సభ్యత్వాన్ని కొనసాగించడం రెండూ వేర్వేరు అంశాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తిరిగి పార్టీలో చేరినంత మాత్రాన చట్టసభ సభ్యత్వంపై పడిన అనర్హత తొలగిపోదని తేల్చిచెప్పింది.

# ప్రణయ్ హత్య కేసు నిందితుడు అబ్దుల్ బారీ మృతి.!

- చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందిన అబ్దుల్ బారీ
- చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించిన జైలు సిబ్బంది
- 2018 నాటి ప్రణయ్ పరువు హత్య కేసులో నాలుగో నిందితుడు
- జీవితఖైదు అనుభవిస్తున్న బారీ
- హరేన్ పాండ్యా హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్న బారీ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:**నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (50) చర్లపల్లి జైలులో మృతి చెందాడు. గురువారం మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో జైలు సిబ్బంది వెంటనే సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అబ్దుల్ బారీ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

### ప్రణయ్ హత్య కేసులో నాలుగో నిందితుడు

2018 సెప్టెంబర్ 14న మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన పెరుమాళ్ల ప్రణయ్ పరువు హత్య కేసులో అబ్దుల్ బారీ నాలుగో నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసులో దీర్ఘకాలిక విచారణ అనంతరం నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం, రెండో అదనపు సెషన్స్ జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది.

### ఒకరికి ఉరిశిక్ష.. ఆరుగురికి జీవితఖైదు

ప్రణయ్ హత్య కేసులో కీలక పాత్రధారి సుభాష్ కుమార్ శర్మకు ఉరిశిక్ష, ఏ2 అస్గర్ అలీ, ఏ4 అబ్దుల్ బారీ, ఏ5 అబ్దుల్ కరీం, ఏ6 శ్రవణ్ కుమార్, ఏ7 శివ, ఏ8 నిజాంలకు జీవితఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. కేసులో ప్రధాన నిందితుడు తిరునగరు మారుతీరావు 2020లో హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడటంతో ఆయనపై విచారణను అప్పట్లోనే నిలిపివేశారు.

### హరేన్ పాండ్యా హత్య కేసులోనూ నిందితుడు

అబ్దుల్ బారీ గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్ పాండ్యా హత్య కేసులోనూ నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం ప్రణయ్ హత్య కేసులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న సమయంలో చర్లపల్లి జైలులో గుండెపోటుతో మృతి చెందాడు.

# దానం నాగేందర్ కేసులో సుప్రీం తీర్పుపై కిషన్ రెడ్డి హర్షం.!

మొదటి పేజీ తరువాయి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫిరాయింపులను విమర్శించి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని ప్రోత్సహించడం రెండు పార్టీల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

### ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యం

దానం నాగేందర్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమవుతుందని కిషన్ రెడ్డి తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచారని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టును బీజేపీ ఆశ్రయించగా.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించిందని, తాజాగా సుప్రీంకోర్టు ఆ నిర్ణయాన్ని సమర్థించిందని తెలిపారు.

### ప్రజలే అంతిమ నిర్ణేతలని వ్యాఖ్య

పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా తీర్పును రాజకీయ అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ కావడంతో అక్కడి ప్రజలకు తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం మరోసారి వచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలేనని తెలిపారు. రానున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రజలు బుద్ధి చెబుతారని, బీజేపీ విజయం సాధిస్తుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బ్యూరో.!

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో ట్రాఫిక్ నిర్వహణ, రహదారి భద్రతను మరింత మెరుగుపర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక బ్యూరో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్రవ్యాప్తంగా పనిచేసే ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను పోలీస్ విభాగంలో ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేయనున్నారు. దీనికి ఏడీజీపీ లేదా ఐజీ స్థాయి అధికారిని డైరెక్టర్‌గా నియమించనున్నారు.

### ప్రమాదాలపై శాస్త్రీయ దర్యాప్తు

ట్రాఫిక్ నిర్వహణ, అమలు చర్యలపై కొత్త బ్యూరో రాష్ట్రవ్యాప్తంగా పర్యవేక్షణ చేపట్టనుంది. హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, ఓఆర్ఆర్‌పై ప్రత్యేక హైవే పెట్రోలింగ్ నిర్వహించనున్నారు. రోడ్డు ప్రమాదాలపై శాస్త్రీయ పద్ధతిలో దర్యాప్తు చేపట్టడంతో పాటు ప్రతి ఘోర ప్రమాద స్థలాన్ని బహుళ విభాగాల కమిటీ పరిశీలించనుంది.

### ఉల్లంఘనలపై ప్రత్యేక నిఘా


ఈ-చలాన్లు, ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్, సీట్ బెల్ట్, అతివేగం వంటి ఉల్లంఘనలపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నారు. పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టనున్నారు. మెట్రో, బుల్లెట్ రైలు సహా రైలు ప్రయాణ భద్రతపైనా బ్యూరో పర్యవేక్షణ చేయనుంది.

### కొత్త పోస్టుల ఏర్పాటు

ప్రతి పోలీస్‌స్టేషన్‌లో రోడ్డు ప్రమాద స్పందన అధికారిని నియమించనున్నారు. ప్రతి కమిషనరేట్‌లో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ పోస్టు, ప్రతి జిల్లాలో అదనపు ఎస్పీ ట్రాఫిక్ పోస్టును ఏర్పాటు చేయనున్నారు. ట్రాఫిక్ విభాగంలోని 300 పోస్టులను కొత్త బ్యూరోకు బదిలీ చేయనున్నారు.

### జరిమానాల్లో 40 శాతం ప్రత్యేక నిధికి

ట్రాఫిక్ ఉల్లంఘనలపై విధించే జరిమానాల్లో 40 శాతాన్ని ట్రాఫిక్ నిర్వహణ నిధికి మళ్లించనున్నారు. ఈ నిధులతో ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరికరాలు, పెట్రోలింగ్ వాహనాలు కొనుగోలు చేయనున్నారు. ట్రాఫిక్ సిబ్బందికి శరీరానికి అమర్చుకునే కెమెరాలు, రక్షణ పరికరాలు అందించడంతో పాటు రాష్ట్ర ట్రాఫిక్ శిక్షణ అకాడమీని కూడా ఏర్పాటు చేయనున్నారు.





# మఠంపల్లిలో తుఫాను బీభత్సం

- రహదారిపై కూలిన మర్రిచెట్టు
- స్పందించిన మఠంపల్లి పోలీసులు

**ప్రజా వాయిస్, మఠంపల్లి,సెప్టెంబర్ 24** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో రఘునాథపాలెం నుంచి కిష్టాపురం వెళ్లే ప్రధాన రహదారిపై భారీ మర్రిచెట్టు కూకటివేళ్లతో సహా నేలకూలింది. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలిసిన వెంటనే మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు బృందం ఘటనాస్థలికి చేరుకుంది. స్థానికులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది సహకారంతో రహదారిపై పడిన చెట్టును తొలగించి, వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మఠంపల్లి ఎస్సై ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రహదారులపై చెట్లు కూలడం లేదా ఇతర ఆటంకాలు ఏర్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.







# హుజూర్‌నగర్‌ను ముంచెత్తిన వాన.!

- ఎడతెరిపిలేని వర్షాలతో జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- ఉప్పొంగిన వాగులు, వంకలు.. పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మఠంపల్లి మండలంలో భారీ చెట్టు నేలకూలి విద్యుత్ సరఫరా బంద్
- రాత్రివేళ ఘటనతో తప్పిన పెను ప్రమాదం..

అప్రమత్తమైన అధికారులు


**ప్రజా వాయిస్,హుజూర్‌నగర్:**హుజూర్‌నగర్ నియోజకవర్గంలో భారీ వర్షాలు కలకలం రేపాయి. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వాగులు, వంకలు ఉప్పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రహదారులపై వరదనీరు ప్రవహించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

### కూలిన భారీ వృక్షం.. తప్పిన ముప్పు

మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో భారీ వర్షం, ఈదురుగాలుల ధాటికి పెద్ద చెట్టు నేలకూలింది. విద్యుత్ లైన్లపై చెట్టు పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రాత్రి సమయంలో ఘటన చోటుచేసుకోవడంతో ఆ మార్గంలో రాకపోకలు తక్కువగా ఉండి పెను ప్రమాదం తప్పింది. పగటి సమయంలో జరిగి ఉంటే పరిస్థితి తీవ్రంగా ఉండేదని స్థానికులు తెలిపారు.వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొన్ని గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వర్షాలు కొనసాగితే మరిన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వరదనీరు ప్రవహించే ప్రాంతాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# ఎన్‌ఎస్‌యూఐలో కుల వివక్ష కలకలం.!

- దళితుడిననే అణచివేతకు కుట్రలు.. రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి సంచలన లేఖ
- రాష్ట్ర, జిల్లా కమిటీల ఏర్పాటుకు అడ్డంకులు
- పదవీకాలం పూర్తికాకముందే తొలగించే ప్రయత్నాలు
- ఆర్థికంగా, మానసికంగా ఒత్తిళ్లు.. వ్యతిరేక ప్రచారం చేయించారని ఆరోపణ
- కాంగ్రెస్ అధిష్ఠానం, దళిత,బలహీన వర్గాల నేతల దృష్టికి తీసుకెళ్లిన వెంకటస్వామి










**ప్రజా వాయిస్,హైదరాబాద్:** తెలంగాణ ఎన్‌ఎస్‌యూఐలో కుల వివక్ష అంశం కలకలం రేపుతోంది. తనను దళితుడిననే కారణంతోనే అణచివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి ఆరోపించారు. ఈ మేరకు దళిత, బడుగు, బలహీన వర్గాల నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన బహిరంగ లేఖ రాశారు. తనను, తన కమిటీని ఓ మాజీ రాష్ట్ర నాయకుడు లక్ష్యంగా చేసుకుని నిరంతరం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్ర, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసుకోకుండా అడ్డంకులు సృష్టించారని వెంకటస్వామి పేర్కొన్నారు. తాజాగా కమిటీ నియామకాన్ని కారణంగా చూపి.. తన పదవీకాలం పూర్తికాకముందే రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తనపై జరిగిన పరిణామాలను కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు దళిత, బడుగు, బలహీన వర్గాల నాయకుల దృష్టికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

### పేద దళిత కుటుంబం నుంచి..

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహ్మత్‌నగర్ బస్తీకి చెందిన పేద దళిత కుటుంబం నుంచి తాను వచ్చినట్లు వెంకటస్వామి తెలిపారు. మొదటి తరం విద్యార్థి నాయకుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, 14 ఏళ్లుగా ఎన్‌ఎస్‌యూఐలో పనిచేశానని పేర్కొన్నారు. తన సేవలను గుర్తించిన పార్టీ పెద్దలు రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించారని తెలిపారు.

### తలవంచను.. పోరాటం ఆపను

తనపై ఆర్థికంగా, మానసికంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు జరిగాయని వెంకటస్వామి ఆరోపించారు. తనకు వ్యతిరేకంగా పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయించారని, కొందరు దళితులను సైతం తనకు వ్యతిరేకంగా నిలబెట్టే ప్రయత్నం జరిగిందని పేర్కొన్నారు. అయితే ఎలాంటి ఒత్తిళ్లకు తలవంచబోనని, తన పోరాటాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు.మన హక్కులు ఎవరూ ఇవ్వరు.. మనం పోరాడి సాధించుకోవాలి అనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు. తన పదవి కోసం కాకుండా.. భవిష్యత్తులో దళిత యువతకు రాజకీయ అవకాశాలు తగ్గకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ అంశాన్ని బహిరంగంగా ప్రస్తావిస్తున్నానని లేఖలో తెలిపారు.

# లక్షలు ఖర్చు "నిఘా" మాత్రం గాలికి

- కిస్మత్ పూర్ జీహెచ్ ఎంసీ కార్యాలయంలో కెమెరాల నిర్వహణపై నిర్లక్ష్యం
- ప్రజాధనం ఖర్చు పెట్టడమేనా'నిర్వహణ అవసరం లేదా.?
- పర్యవేక్షణ ఎక్కడ.? బాధ్యత ఎవరిది.?
- ఏదైనా ఘటన జరిగితేనే మేల్కొంటారా.?





**ప్రజా వాయిస్//రాజేంద్రనగర్:** ప్రజల భద్రత, కార్యాలయ ప్రాంగణంపై నిఘా కోసం లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారన్న ఆరోపణలు కిస్మత్‌పూర్‌లో వినిపిస్తున్నాయి.కెమెరాలు పనిచేస్తున్నాయా.? లేదా.? అన్న కనీస పరిశీలన కూడా జరుగుతోందా అంటూ కార్యాలయానికి వచ్చే ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయలు వెచ్చించి నిఘా కెమెరాలు ఏర్పాటు చేసిన తర్వాత వాటి పనితీరును నిరంతరం పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే.కానీ కెమెరాల పరిస్థితిపై పట్టింపు లేకుండా వదిలేయడం వల్ల ప్రజాధనంతో ఏర్పాటు చేసిన వ్యవస్థ నిరుపయోగంగా మారే పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కార్యాలయంలో ఏదైనా చోరీ జరిగినా,అవాంఛనీయ ఘటన చోటుచేసుకున్నా, అప్పటికప్పుడు కెమెరాల కోసం అధికారులు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి వస్తుందా.? అని ప్రజలు నిలదీస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత ఆధారాల కోసం వెతకడం కంటే,ముందుగానే నిఘా వ్యవస్థను సక్రమంగా పనిచేసేలా చూడటం అధికారుల బాధ్యత కాదా.? అని ప్రశ్నిస్తున్నారు.ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థపైనే నిర్లక్ష్యం ఉంటే భద్రత ఎలా.? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్యాలయంలోని అన్ని సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసి,పనిచేయని వాటిని వెంటనే మరమ్మతులు చేయించి, నిరంతర పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# వైద్యం అందక.. ఆవులు మృత్యువాత

- వారం రోజుల్లో రెండు పాడి ఆవులు మృతి
- రైతు కరంటోత్ బాలు కన్నీటి ఆవేదన
- రూ.లక్షకు పైగా నష్టం.
- ప్రభుత్వ పశువైద్యశాలలో వైద్యులు అందుబాటులో లేరని ఆరోపణ
- నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని తండావాసుల డిమాండ్

జా వాయిస్,సంస్థాన్ నారాయణపురం: పశువైద్యుల నిర్లక్ష్యం ఓ రైతు కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెంకం భావి తండాకు చెందిన రైతు కరంటోత్ బాలు వారం రోజుల వ్యవధిలోనే తన జీవనాధారమైన రెండు పాడి ఆవులను కోల్పోయాడు. దీంతో రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.తన ఆవుకు తీవ్ర జలుబుతో పాటు దొమ్మరోగం రావడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలకు పలుమార్లు వెళ్లినట్లు బాలు తెలిపాడు. అయితే సమయానికి వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సరైన వైద్యం అందలేదని ఆరోపించాడు. పరిస్థితి విషమించడంతో ఆవు మృతి చెందిందని వాపోయాడు. వారం రోజుల క్రితం కూడా మరో ఆవు ఇదే విధంగా మృతి చెందినట్లు తెలిపాడు.రెండు ఆవులు మృతి చెందడంతో తన కుటుంబ జీవనాధారమే దెబ్బతిందని బాలు కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వ పశువైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని తండావాసులు డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం నష్టపరిహారంతో ఆదుకోవాలని కోరారు.










# శతాబ్దం నాటి రైతుల బాటకు 'గండి'

- జేసీబీతో దారికి అడ్డంగా గుంతలు
- పొలాలకు వెళ్లలేక గిరిజన రైతుల అవస్థలు
- రాకపోకలు నిలిచిపోయాయని ఆవేదన
- బెదిరింపులు, అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపణ
- కలెక్టర్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని గోపతండ రైతుల వేడుకోలు

**ప్రజా వాయిస్,మోతె:** తరతరాలుగా తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు వినియోగిస్తున్న బాటకు అడ్డంకులు ఏర్పడటంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా మోతె మండలం గోపతండ గ్రామానికి చెందిన గిరిజన రైతులు సుమారు శతాబ్ద కాలంగా తమ పొలాలకు వెళ్లేందుకు వినియోగిస్తున్న దారిని మూసివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. నేడువాయి గ్రామానికి చెందిన ముప్పాని శ్రీరామ్‌రెడ్డి ఆ భూమి తనదంటూ తమ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారని వారు పేర్కొన్నారు.

### దారికి అడ్డంగా గుంతలు

ఇటీవల జేసీబీ యంత్రాలను తీసుకొచ్చి దారికి అడ్డంగా భారీగా గుంతలు తవ్వడంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు తెలిపారు. దీంతో పంటల సాగు, దుక్కులు దున్నడం, విత్తనాలు, ఎరువులు తరలించడం వంటి వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. ఏళ్ల తరబడి వినియోగిస్తున్న దారిని ఒక్కసారిగా అడ్డుకోవడంతో తమ జీవనాధారమైన వ్యవసాయమే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### గిరిజనులమని అవమానిస్తున్నారు

దారి విషయంలో తమను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపించారు. తాము గిరిజనులమనే కారణంతో అవమానకరంగా మాట్లాడుతున్నారని, డబ్బు బలంతో తమపై ఒత్తిడి తెచ్చి దారిని వినియోగించకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యను ప్రశాంతంగా పరిష్కరించాల్సింది పోయి దారిని గుంతలు తీసి మూసివేయడం సరికాదని అన్నారు.

### కలెక్టర్ చొరవ చూపాలి

తమకు న్యాయం జరిగేలా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించాలని గోపతండ రైతులు విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దారి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కోరారు. దశాబ్దాలుగా తాము వినియోగిస్తున్న మార్గంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, వ్యవసాయ పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకల దారిని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

# గుంతల బారిన హాలియా బ్రిడ్జి..!

- కోదాడ,జడ్చర్ల హైవేపై ప్రమాదకరంగా మారిన వంతెన
- నిత్యం వందలాది వాహనాల రాకపోకలు..
- అడుగడుగునా గుంతలతో అవస్థలు..
- ప్రమాదం ముంచుకొస్తున్నా పట్టించుకోని అధికారులు



**హాలియా, ప్రజా వాయిస్:**కోదాడ,జడ్చర్ల జాతీయ రహదారిపై హాలియా వాగుపై నిర్మించిన బ్రిడ్జి గుంతలమయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక వంతెనపై పలుచోట్ల గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవేపై వేగంగా ప్రయాణించే వాహనాలు ఒక్కసారిగా గుంతలు ఎదురుకావడంతో అదుపుతప్పే పరిస్థితులు నెలకొంటున్నాయి.

### రాత్రివేళ మరింత ప్రమాదకరం

పగటిపూట ఎలాగో గుంతలను తప్పించుకుని వాహనాలు నడుపుతున్నప్పటికీ రాత్రివేళ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. సరైన వెలుతురు లేకపోవడంతో గుంతలు ముందుగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వాహనాలు దిగడంతో టైర్లు, ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

### నిత్యం రద్దీ.. అయినా పట్టింపు కరువు

కోదాడ,జడ్చర్ల హైవే కావడంతో ఈ మార్గంలో నిత్యం భారీ సంఖ్యలో కార్లు, బస్సులు, లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యం ఉన్న బ్రిడ్జిపై రహదారి దెబ్బతిన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి మరమ్మతులతో పరిష్కరించగల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్‌లో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదం జరిగేలోపే స్పందించాలి

బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు దెబ్బతిన్న రహదారికి నాణ్యమైన మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రమాదాలు చోటుచేసుకోకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# సర్కారు స్కూళ్ల పరిస్థితి దారుణం

- పాములు,కుక్కలు,పందులు సంచరిస్తున్నాయి
- పాలకులకు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు
- వికారాబాద్ రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి

**ప్రజా వాయిస్/వికారాబాద్ బ్యూరో:** తెలంగాణలో సర్కారు బడుల పరిస్థితి అధ్వానంగా మారిందని, పాములు, కుక్కలు, పందులు సంచరిస్తున్నాయని, ఈ విషయంలో పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి లేకపోవడం అత్యంత దురదృష్టకరమని మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో టీపీఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల భారం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు, బిల్డింగ్ ఫండ్, పుస్తకాలు, యూనిఫాం, రవాణా తదితర పేర్లతో తల్లిదండ్రులపై అదనపు భారం మోపుతున్నారని ఆరోపించారు.ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, పర్యవేక్షణ కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి, సంబంధిత చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం, నాణ్యమైన విద్య అందించడం, ఉపాధ్యాయుల కొరతను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారాన్ని నియంత్రించాలని తెలంగాణ పీపుల్స్ ఫ్రంట్ (టీపీఎఫ్) డిమాండ్ చేస్తుందన్నారు.రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి 18 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ప్రొఫెసర్ పద్మజ షా, మాజీ ఐఏఎస్ లో ఎం.వి రెడ్డి, ఎం. చంపాలాల్, ఎన్,రుబీనా, సృజన యాదవ్,ముప్పూరి తదితర వక్తలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, తదితరులు పాల్గొన్నారు.

# పేటలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు అస్తవ్యస్తం

- లక్షల్లో ఖర్చు.. పనుల్లో మాత్రం కనిపించని ఫలితం
- మట్టి, కంకర కోసం రూ.10 లక్షల మున్సిపల్ ఆమోదం
- చెరువులో నీటి లో బాల వినాయకులు మూనగటం లేదు
- తట్టెడు మట్టి తీయలేదన్న ఆరోపణలు



**ప్రజా వాయిస్,సంగారెడ్డి** : సదాశివపేటలో గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల పేరుతో లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిమజ్జనానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నామంటూ భారీగా నిధులు కేటాయిస్తున్నా.. పనుల పురోగతి, నాణ్యతపై పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా మట్టి, కంకర కోసం సుమారు రూ.10 లక్షల మేర మున్సిపల్ అంచన వ్యాయాలు పొందినట్లు సమాచారం. అయితే ఉబా చెరువు నుంచి కనీసం ఒక్క తట్టెడు మట్టి కూడా తీయలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్క బాల వినాయకుడు నీటిలో మునగాలేని పరిస్థితి ఉంది. పెద్ద వినాయకులు ఎలా నిమర్జనం చేస్తారు అనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. అధికార పాలక చేర్మెన్ నిర్లక్ష్యం. వాళ్లే ఈ పరిస్థితి రావడం దారుణంమని తెలుపుతున్నారు.మరోవైపు పూడికతీత పనుల పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారన్న ప్రచారం కూడా ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది.

### నీళ్లు లేక 5, 6 అడుగుల బాల వినాయకులు నీటిలో మునగని పరిస్థితి

నిమజ్జనానికి వచ్చే 5, 6 అడుగుల బాల వినాయక విగ్రహాలు సైతం పూర్తిగా నీటిలో మునగని పరిస్థితి ఏర్పడుతుండటంపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిమజ్జన ప్రాంతంలో సరైన లోతు, నీటి ప్రవాహం, భద్రతా ఏర్పాట్లు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

భక్తి ముసుగులో ప్రజాధనం దుర్వినియోగమా... గణేష్ నిమజ్జనం వంటి పవిత్ర కార్యక్రమం పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పుడు ప్రతి రూపాయికి లెక్క ఉండాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కేటాయించిన నిధులు, చేసిన పనులు, బిల్లులు, పనుల పరిమాణంపై పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు.మున్సిపల్ కమిషనర్, చైర్మన్‌పై ప్రజల ఆగ్రహం. వ్యక్తం చేస్తున్నారు.ఏర్పాట్లలో లోపాలు, నిధుల వినియోగంపై స్పష్టత లేకపోవడంపై మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ తీరుపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాధనాన్ని ఖర్చు చేసే విషయంలో అధికారులు పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.నిధుల ఖర్చుపై విచారణ చేపట్టాలిగణేష్ నిమజ్జనం, పూడికతీత, మట్టి–కంకర కొనుగోలు తదితర పనులకు కేటాయించిన నిధులపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. నిధుల కేటాయింపు నుంచి పనుల పూర్తివరకు ప్రతి అంశాన్ని పరిశీలించి, అక్రమాలు లేదా అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి రూ.5 లక్షలతో డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ పనులకు శ్రీకారం
- ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు
- మున్సిపల్ చైర్మన్ జాము రవి

**మేడ్చల్, శామీర్ పేట్ /** ప్రజా వాయిస్: మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. మున్సిపాలిటీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మున్సిపల్ చైర్మన్ జాము రవి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు.మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో రూ.2.50 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు, 3వ వార్డులో రూ.2.50 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు ఉపశమనం కలగనుంది.ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ...... ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులను దశలవారీగా చేపడుతున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, మున్సిపల్ డీఈ స్ఫూర్తి, 8వ వార్డు కౌన్సిలర్ దోసకాయల లతా వెంకటేష్, 9వ వార్డు పెద్దిరెడ్డి శ్రీలత వెంకటరెడ్డి, 21 వ వార్డు రాజీగల్ల లతా భూపాల్ తదితరులు పాల్గొన్నారు.అలాగే 3వ వార్డులో కౌన్సిలర్ గొంది శ్రీవాణి వైద్యనాథ్, కౌన్సిలర్ చిన్నలచ్చ సరిత శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు వెంకట నరసింహారెడ్డి, వెంకటేష్ షావుకారి, ముంద స్వామి తదితరులు పాల్గొన్నారు.మున్సిపాలిటీ పరిధిలో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని అధికారులు తెలిపారు.

# వాన దెబ్బకు.. గూడు నేలమట్టం

- మోతెలో భారీ వర్షానికి కూలిన నిరుపేద ఇంటి గోడ
- ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రాణాపాయం
- అద్దె ఇంట్లో తలదాచుకున్న కుటుంబం
- ఇందిరమ్మ ఇల్లు కోసం లింగాల లక్ష్మీ వేడుకోలు



**ప్రజా వాయిస్,మోతె:** భారీ వర్షం ఓ నిరుపేద కుటుంబం పాలిట కన్నీటిని మిగిల్చింది. సూర్యాపేట జిల్లా మోతె మండల కేంద్రానికి చెందిన లింగాల లక్ష్మీ,యాదగిరి దంపతుల పాత సిమెంట్ గోడల ఇల్లు గురువారం కురిసిన వర్షానికి ఒక్కసారిగా కూలిపోయింది. రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వానకు గోడలు పూర్తిగా తడిసి బలహీనపడటంతో ఉదయం పెద్ద శబ్దంతో కూలాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.గోడ కూలడంతో ఇంట్లోని వంట సామగ్రి, బట్టలు, ఇతర వస్తువులు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. కొన్ని వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవించే కుటుంబానికి సొంత గూడు కూడా లేకుండా పోయింది. ప్రస్తుతం అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నారు.

### ఇల్లు కట్టుకునే స్థోమత లేదు

'ఇల్లు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని లింగాల లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలమైన తమకు కొత్త ఇల్లు నిర్మించుకునే స్థోమత లేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు. రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తగిన సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



# అధికారం ఉందని విర్రవీగొద్దు!

- అధికారం,పదవులు శాశ్వతం కాదు
- స్పీకర్ నిర్ణయం న్యాయస్థానాల్లో నిలబడలేకపోయింది
- ఇకనైనా రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి
- వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో** :అధికారం ఉందని విర్రవీగొద్దనీ, అధికారం, పదవులు శాశ్వతం కాదని, అంతిమ తీర్పు ప్రజలదేననివికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం ఆయనకు ప్రకటనలోమాట్లాడుతూ.. దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పుతో నిజాలు మరింత స్పష్టమయ్యాయని అన్నారు. బీఆర్ఎస్ టికెట్‌పై 2023లో ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారని పేర్కొన్నారు.తెలంగాణ హైకోర్టు దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నిర్ణయాన్ని పక్కనపెట్టిన నేపథ్యంలో.. ఆ తీర్పులో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి కారణం లేదంటూ సుప్రీంకోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టివేసిందని తెలిపారు. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీగా ఉన్న విషయం స్పష్టమైందన్నారు."స్పీకర్ నిర్ణయం న్యాయస్థానాల్లో నిలబడలేకపోయింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరపున లోక్‌సభ ఎన్నికల్లో ఎలా పోటీ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలి" అని మెతుకు ఆనంద్ ప్రశ్నించారు.రేవంత్ రెడ్డిని నమ్మి దానం నాగేందర్ రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డారని విమర్శించిన ఆయన.. అధికారం, పదవులు శాశ్వతం కాదని, రాజ్యాంగం–ప్రజాస్వామ్య విలువలు శాశ్వతమని అన్నారు."స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు కొట్టివేసింది.. ఇప్పుడు సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోలేదు. ఇకనైనా రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడాలి. ఖైరతాబాద్‌లో ప్రజల తీర్పు కోరాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజాస్వామ్యంలో అంతిమ తీర్పు ప్రజలదే" అని డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

# పెద్దారెడ్డిపేటలో బంగారు నగల కోసం వృద్ధురాలి హత్య

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** ఒంటరిగా నివసిస్తున్న ఓ వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తులు గొంతు నులిమి హత్య చేసిన సంఘటన గురువారం పుల్కల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని పెద్దారెడ్డిపేట గ్రామానికి చెందిన కొత్తగాడి పోచమ్మ (70) వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తుంది. బుధవారం రాత్రి బోజనం చేసి నిద్రపోయింది. మద్యరాత్రిలో గుర్తు తెలియని వ్యక్తి డోర్ తొలగించి ఇంట్లోకి వెళ్ళి ఆమే ఒంటిపై దరించిన బంగారు చెవికమ్మలు,మెడలోని గుండ్లు మూడు తులాల నగలు తీసుకుని గొంతు నులిమి హత్య చేశారు. ఉదయం పక్కింట్లో ఉంటున్న ఆమే బందువు సంగయ్య వచ్చి చూసేసరికి మృతదేహంగా పడి ఉంది. ఈ విషాయాన్ని చుట్టుపక్కల వారికి తెలిపి వెంటనే పోలిసులకు సమాచారం అందించారు. పుల్కల్ ఎస్ఐ విశ్వజన్, జోగిపేట సీఐ అనీల్ కుమార్, కంది క్రై సీఐ ప్రసాద్, సంఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ ద్వార వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టమ్ కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి మేనల్లుడు కొత్తగాడి మొగులయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలిసులు తెలిపారు.



# ఓట్ల సమయంలోనే 'గిరిజనులు' గుర్తుకొస్తారా?

- తండాల నిధులపై స్పందన ఏదీ?
- బొమ్మలరామారం మండలంలో అధ్వానంగా గిరిజన తండాల రోడ్లు.
- 16 ఏళ్లుగా పట్టించుకోని పాలకులు, అధికారులు
- రోడ్డు సరిగా లేక అంబులెన్సులూ రావట్లేవని ఆవేదన
- విద్యార్థుల చదువులకు 'కిరాయి' భారం



**ప్రజావాయిస్/ బొమ్మలరామారం** యాదాద్రి భువనగిరి జిల్లా ఎన్నికలు రాగానే ఓట్ల కోసం గిరిజన తండాల బాట పట్టే నాయకులు, ప్రజాప్రతినిధులకు ఆ తర్వాత తండాల సమస్యలు, రోడ్ల అభివృద్ధి నిధులు మాత్రం గుర్తుకురావడం లేదు. బొమ్మలరామారం మండలంలోని గిరిజన తండాల పట్ల అధికారులు, పాలకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ చిన్నచూపు చూస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

### ఏడు తండాలకు ఒకటే దిక్కు.. అదీ అడుగడుగునా గోతులమయం!

బొమ్మలరామారం మండల పరిధిలోని చీకటిమామిడి మెయిన్ రోడ్ గ్రామం నుండి మర్యాల సబ్ స్టేషన్ వరకు ఉన్న 8 కిలోమీటర్ల బీటీ రోడ్డు మోకాళ్ల లోతు గోతులతో అత్యంత ప్రమాదకరంగా మారింది. వాలు తండా, సీత తండా, లక్క తండా,గోవింద్ తండా, మంచ తండా, చొప్పరి చెట్టు తండా, కేకే తండాలకు ఈ రోడ్డే ప్రధాన ఆధారం. సుమారు 5 వేల జనాభా ఉన్న ఈ తండాల్లోని ప్రజలు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. 2009లో నిర్మించిన ఈ రోడ్డుకు గత 16 ఏళ్లుగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది.

### అత్యవసర వేళ.. అంబులెన్సూ రాదు!

రోడ్డు పరిస్థితి ఘోరంగా ఉండటంతో అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ డ్రైవర్లు కూడా తండాలకు రావడానికి భయపడుతున్నారు. సమయానికి దవాఖానకు వెళ్లలేక గర్భిణులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వాహనాలు కూడా కిరాయికి రావడానికి నిరాకరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పిల్లల చదువులకు 'కిరాయి' నరకం

ఈ ఏడు తండాల నుంచి సుమారు 150 మందికి పైగా విద్యార్థులు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, చీకటిమామిడి జెడ్పీ హైస్కూల్‌కు వెళ్తున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో నెలకు ₹750 ఆటో కిరాయిలు చెల్లించాల్సి వస్తోంది. నిరుపేద తండాల ప్రజలు ఈ భారాన్ని మోయలేక కొందరు తమ పిల్లల చదువులను మధ్యలోనే మాన్పిస్తున్న దయనీయ పరిస్థితి నెలకొంది. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం నుండి మర్యాల సబ్ స్టేషన్, చౌదర్పల్లి మీదుగా చీకటి మామిడి వరకు ఆర్టీసీ బస్సును నడిపించాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన రోడ్డు మరమ్మతులు చేపట్టి, రవాణా సౌకర్యం కల్పించాలని స్టానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మాదిగ సర్పంచ్ పట్ల ఎమ్మెల్యే వంశీకృష్ణ వైఖరి మార్చుకోవాలి

**ప్రజా వాయిస్ అచ్చంపేట** సెప్టెంబర్ 24 బాబు జగ్జీవన్ రావు భవనం కేంద్రంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సౌటా కాసిం మాట్లాడుతూ జాజాల గ్రామ సర్పంచ్ జిలకర కాశమ్మ పట్ల ఎమ్మెల్యే వైఖరి సరికాదన ఆయన అన్నారు ప్రజలచే రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికైన మహిళ గ్రామ సమస్యలు, అభివృద్ధి గురించి మాట్లాడిన సందర్భంలో నిన్ను సస్పెండ్ చేయిస్తా అని ఎమ్మెల్యే మాట్లాడటం సరికాదని అన్నారు. రాజకీయాలలో పార్టీలు వేరు అయిన గ్రామాల అభివృద్ధి కోసం పని చేయాలని అన్నారు.రాజకీయాలలో భాగంగా కాశమ్మపై కుట్రలు జరిగితే సహించేది లేదు నియోజకవర్గంలో 50 పైగా గ్రామాలలో సర్పంచ్ లు గెలిచిన బిల్లులు ఎందుకు ఆపడంలేదని అన్నారు.అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నట్టుగా జజాల గ్రామంలో అధికారులు తీర్మానం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కేవలం జాజాల సర్పంచ్ బిల్లులు ఆపితే మాదిగలపై ఎమ్మెల్యే వైఖరి గానే పరిగనిస్తామని అన్నారు.పలువురు మాదిగ ప్రజాప్రతినిధులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## జైపూర్ ప్లాంట్ సందర్శనలో బీఆర్ఎస్ నేతల ధ్వజం

**ప్రజా వాయిస్ జైపూర్, సెప్టెంబర్ 24** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (STPP)ను గురువారం బీఆర్ఎస్ నేతల బృందం క్షేత్రస్థాయిలో సందర్శించింది. మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి , అనిల్ జాధవ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్ రావు, దుర్గం చిన్నయ్య, కోనేరు కోనప్ప, నాయకుడు జాన్సన్ తదితరులు ప్లాంట్‌కు చేరుకుని, అక్కడ విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను మరియు ప్లాంట్ పనితీరును పరిశీలించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రోజుకు కనీసం 20 సార్లు విద్యుత్ కోతలు విధిస్తూ రైతాంగాన్ని, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కావాలని విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు అక్కడి సిబ్బంది ద్వారా తెలిసిందని, దీని వెనుక ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను, బొగ్గు కుంభకోణాన్ని త్వరలోనే ఆధారాలతో సహా బయట పెడతామని వారు హెచ్చరించారు.

### రాజకీయ సన్యాసానికి సిద్ధం: బాల్క సుమన్ సవాల్

అనంతరం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేవలం అవినీతి, కమీషన్లపై ఉన్న శ్రద్ధ ప్రజల సంక్షేమంపై లేదని ధ్వజమెత్తారు. ప్లాంట్‌లో 600 మెగావాట్ల సామర్థ్యం ఉన్న రెండు యూనిట్లు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఒక్కటి కూడా సరిగా నడవడం లేదని విమర్శించారు. స్థానిక మంత్రి వివేక్ వెంకటస్వామి కుటుంబానికి పదవులు రాగానే నియోజకవర్గ ప్రజలను, రైతులను పూర్తిగా విస్మరించారని మండిపడ్డారు.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వచ్చినట్లుగా ఇప్పుడు 24 గంటల కరెంట్ వస్తోందని రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా ఒక్కరైనా చెబితే, తాను రాజకీయ సన్యాసానికి సిద్ధమంటూ సుమన్ బహిరంగ సవాల్ విసిరారు. ప్లాంట్‌లో గతంలోలాగా 1000 మెగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే పునరుద్ధరించాలని, లేనిపక్షంలో రైతులు, ప్రజలను సమీకరించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కాజీపేట ప్రభుత్వ బాలికల పాఠశాల దుస్థితిని మార్చండి సార్లు

**ప్రజా వాయిస్, హన్మకొండ**.కాజీపేట పట్టణంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కనీస వసతుల లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. విద్యార్థులకు తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడంతో మాజీ కార్పొరేటర్ గుంటి కుమారస్వామి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించి దాహార్తిని తీర్చారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నప్పటికీ, భోజనం చేసేందుకు సరైన వసతి లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిసిన సమయంలో పాఠశాల ఆవరణలో నీరు నిలిచి, విద్యార్థులు నీటిలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొంటోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని చెబుతున్నప్పటికీ, కాజీపేటలోని ఈ పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



# అడవిబిడ్డల చదువుకు ప్రభుత్వం అండ

- మారుమూల గిరిజన ప్రాంతాల్లోనూ నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం
- అడవిలోనూ అద్భుత ప్రతిభ, పట్టణ విద్యార్థులకు దీటుగా మామిడిగూడెం చిన్నారులు
- ఉత్తమ గురువులు విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చగలరు
- మంత్రి సీతక్క.





**ప్రజా వాయిస్ ములుగు జిల్లా:** ఏటూరునాగారం మండలం; సెప్టెంబర్ 24:/ మారుమూల గిరిజన గూడాల్లోని చిన్నారులకు విద్యను చేరువ చేసి, నాణ్యమైన విద్యావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.గురువారం ఏటూరునాగారం మండలం మామిడిగూడెం గ్రామంలో సింగరేణి కాలరీస్ కంపెనీ సమకూర్చిన రూ.15 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, కొమరం భీమ్‌నగర్ కాలనీలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.5 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు'తో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..... దేశంలో ఎక్కడ పుట్టినా, ఎక్కడ పెరిగినా ప్రతి చిన్నారికి చదువుకునే అవకాశం ఉండాలన్నారు. పాఠశాలలు, రహదారులు, విద్యుత్ సౌకర్యం లేని మారుమూల అటవీ ప్రాంతాల్లో విద్యకు ఆటంకం కలగకుండా అవసరమైన చోట పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

### గిరిజన చిన్నారుల ప్రతిభపై మంత్రి ప్రశంసలు:

గుత్తికోయ ఆదివాసీ గూడెమైన మామిడిగూడెంలో పరిమిత సౌకర్యాల మధ్య విద్యార్థులు ప్రదర్శిస్తున్న ప్రతిభ ఎంతో ఆనందాన్ని కలిగించిందని మంత్రి సీతక్క అన్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో పాటలు, కథలు, సంభాషణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారని ప్రశంసించారు. పట్టణ ప్రాంతాల విద్యార్థులకు దీటుగా గిరిజన చిన్నారులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు ఇర్ప మధు, సారంగం సేవలను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

### గురువు పట్టుదల'తో విద్యార్థుల జీవితాల్లో మార్పు:

పట్టుదల కలిగిన గురువు విద్యార్థుల జీవితాలను మార్చగలరని మంత్రి సీతక్క అన్నారు. దేశానికి గొప్ప శాస్త్రవేత్తలు, విద్యావంతులు, ఉన్నత వ్యక్తులను అందించగల శక్తి ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థులకు సమయం కేటాయించి సరైన మార్గదర్శనం అందించే గురువులు వారి జీవితాల్లో శాశ్వత ముద్ర వేస్తారని పేర్కొన్నారు.

### విద్యావ్యవస్థ బలోపేతానికి నిరంతర పర్యవేక్షణ

:జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతానికి పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, విద్యాశాఖ అధికారుల కృషిని మంత్రి అభినందించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపించి, వారి చదువుకు పూర్తి సహకారం అందించాలని కోరారు.

### మామిడిగూడెంలో మౌలిక వసతులకు హామీ:

మామిడిగూడెంలో త్వరలో బోరు మంజూరు చేసి తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంజూరైన రహదారుల నిర్మాణానికి అటవీ అనుమతులు పొందేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీశాఖ సహకారంతో అంబులెన్సులు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేలా మార్గాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

### విద్యార్థులతో మంత్రి ముఖాముఖి:

అంతకుముందు మంత్రి సీతక్క పాఠశాల విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో కలిసి విద్యార్థులకు ఏకరూప దుస్తులు, బూట్లు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం చేశారు.ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం అదనపు ఎస్పీ మనన్ భట్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా విద్యాశాఖాధికారి ఎ. సిద్ధార్థరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రఘు, ఉల్లాస్ సమన్వయకర్త కృష్ణబాబు, తహసీల్దార్, మండల విద్యాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## గాలివాన బీభత్సంతో దెబ్బతిన్న రేకుల ఇల్లు, పూరి గుడిసెలు

- కూలిపోయిన ఇళ్లను పరిశీలించిన పాల్వంచ ఎంపీడీవో పి. రాజారావు

**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని దంతలబోర గ్రామపంచాయతీ ఎస్సీ కాలనీలో బుధవారం సాయంత్రం వీచిన భారీ గాలివానకు తీవ్ర నష్టం సంభవించింది. గాలివాన ధాటికి కొన్ని ఇళ్లు దెబ్బతిని కూలిపోగా, పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.ఈ ఘటనపై సమాచారం అందుకున్న పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. రాజారావు దంతలబోర ఎస్సీ కాలనీని సందర్శించి గాలివానకు దెబ్బతిన్న ఇళ్లు, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి నష్ట వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ, గాలి వాన కారణంగా జరిగిన నష్టాన్ని సంబంధిత అధికారుల ద్వారా నమోదు చేయించి, అర్హులైన బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగిన ప్రాంతాల్లో సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని తెలిపారు.బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో, పి. రాజారావు భరోసా కల్పించారు.

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజా వాయిస్,హనుమకొండ:**జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో వర్ష పరిస్థితులపై సమీక్షించారు.వేలేరు, ఆత్మకూరు మండలాల్లో బుధవారం అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు, వంకలు, చెరువులు, రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గతంలో ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.చెరువుల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అవసరమైన చోట ఇసుక బస్తాలు, జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని సూచించారు.కంట్రోల్ రూమ్‌లో అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల కారణంగా నష్టం జరిగితే తక్షణమే నివేదిక అందజేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## తుఫాన్ దెబ్బకు రైతన్న విలవిల!!


- 200 ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం
- విరిగిన కరెంటు స్తంభాలు
- ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- రైతులను ఇల్లు కోల్పోయిన వారిని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**ప్రజా వాయిస్ బూర్గంపాడు** బూర్గంపాడు మండలం వేపలగడ్డ, మొరంపల్లి బంజర్ ప్రాంతాల్లో తుఫాన్ ప్రభావం అన్నదాతలపై తీవ్ర ప్రభావం చూపింది. గంటల వ్యవధిలో వీచిన బలమైన గాలులు, వర్షం కారణంగా పంట పొలాలు దెబ్బతినడంతో రైతులు ఆవేదనలో మునిగిపోయారు. పత్తి, మిర్చి, వరి పంటలు పెద్దఎత్తున నేలవాలడంతో సుమారు 150 నుంచి 200 ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పాటు విద్యుత్ తీగలు తెగిపడటం పరిస్థితిని మరింత సంక్లిష్టంగా మార్చింది.నెలల తరబడి పంటలను కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులకు ప్రకృతి ఒక్కసారిగా గట్టి షాక్ ఇచ్చింది. సాగు కోసం చేసిన ఖర్చులు, కూలీలకు చెల్లించిన డబ్బులు, ఎరువులు, విత్తనాల కోసం పెట్టిన పెట్టుబడులు అన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారాయి. పంట దిగుబడితో కుటుంబ అవసరాలు తీర్చుకోవాలని, అప్పులు చెల్లించాలని భావించిన రైతులకు నేలకొరిగిన పంటలు నిరాశనే మిగిల్చాయి. చేతికొచ్చే సమయంలో పంట దెబ్బతినడంతో తమ పరిస్థితి దిక్కుతోచని విధంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా వాతావరణం ఇంకా అనుకూలంగా లేకపోవడంతో రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. తుఫాన్ ప్రభావం మరికొంత కాలం ఉంటే ఇప్పటికే దెబ్బతిన్న పంటలకు అదనంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు చెబుతున్నారు. నష్టాన్ని కళ్లారా చూసిన రైతులు ఇక ప్రభుత్వ సాయంపైనే ఆశలు పెట్టుకున్నారు. అధికారులు వెంటనే పొలాలను పరిశీలించి నష్టాన్ని నమోదు చేయడంతో పాటు బాధిత రైతులకు తగిన పరిహారం అందించాలని, తెగిపోయిన విద్యుత్ లైన్లను త్వరగా పునరుద్ధరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు పంట నష్టపోయిన రైతులను, ఇల్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అక్కడ ఉన్న పరిస్థితిని సమీక్షించి పంట నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని అంతేనా పరిస్థితిని ఎమ్మెల్యే గారు సమీక్షించి రైతులకు అండగా నిలబడతామని, తక్షణమే ఎంత పంట నష్టం జరిగిందో అంచనా వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. అలాగే ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

## ఇంట్లో నోట్ల కట్టలు

- రూ.1.35 కోట్లు బొమ్మ వెంకటేశ్ నివాసంలో నగదు గుర్తింపు
- విదేశీ కరెన్సీ, 14 లీటర్ల విదేశీ మద్యం కూడా లభ్యం



Government of Telangana
Anti-Corruption Bureau

Press Note No. 143 — Date: 24.09.2026

Continuation of Searches in the Disproportionate Assets case registered against Deputy Superintendent of Police, Police Computer Services O/o the DGP, Telangana State, Hyderabad

Earlier, Disproportionate Assets case vide Cr.No.21/RCA-CR-2/2026, dated 27.06.2026, under Section 13(1)(b) read with Section 13(2) of the Prevention of Corruption Act, 1988 (as amended in 2018), was registered by the Anti-Corruption Bureau, City Range II, Hyderabad, against Sri Sankireddy Bheem Reddy, DSP, Police Computer Services, O/o the DGP, Telangana State, Hyderabad.

In continuation of the earlier searches, and in pursuance of the search warrants issued by the Hon'ble Principal Special Judge for SPE & ACB Cases, Hyderabad, searches were conducted today, i.e., 24.09.2026, at 10 different locations in Hyderabad and Zaheerabad limits, including the residences of suspected benamis who are alleged to have financial and other transactions with the accused officer.

During the searches, several documents and other items forming part of the evidence relating to the suspected benami assets were seized from the residences of the suspected benamis. Further, an amount of Rs. 1.35 crore in cash was found at the residence of Sri Bomma Venkatesh. In addition, foreign currency and approximately 14 litres of foreign liquor were also found. An intimation regarding the foreign liquor was given to the Excise Department for taking necessary action, and a case is likely to be registered by the concerned Excise authorities as per law.

The case is under investigation.

CELL PHONE NUMBER -1064 (TOLL FREE NUMBER): In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms whatsapp (9440446106), facebook (Telangana ACB), X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is displayed in all Government offices and prominent public to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.

Sd/- 24/9/26.
P.R.O.
Anti-Corruption Bureau,
TG., Hyderabad.

**ప్రజా వాయిస్// రాజేంద్రనగర్:** పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్‌రెడ్డిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ సోదాలు కొనసాగుతున్నాయి. గురువారం గండిపేట మండలం పుప్పాల్ గూడాలో బొమ్మ వెంకటేశ్ నివాసంలో అలాగే జహీరాబాద్ పరిధిలోని 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ..కోర్టు జారీ చేసిన సోదా వారెంట్ల ఆధారంగా చేపట్టిన ఈ తనిఖీల్లో భీమ్‌రెడ్డితో ఆర్థిక,ఇతర లావాదేవీలు ఉన్నట్లు అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లోనూ సోదాలు నిర్వహించారు. అనుమానిత బినామీ ఆస్తులకు సంబంధించిన పలు పత్రాలు,ఇతర వస్తువులను అధికారులు ఆధారాలుగా స్వాధీనం చేసుకున్నారు.

### బొమ్మ వెంకటేశ్ ఇంట్లో భారీగా నగదు

ఏసీబీ సోదాల్లో బిల్డర్ బొమ్మ వెంకటేశ్ నివాసంలో రూ.1.35 కోట్ల నగదు లభించడం కీలకంగా మారింది.దీంతోపాటు విదేశీ కరెన్సీ,సుమారు 14 లీటర్ల విదేశీ మద్యం కూడా గుర్తించినట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ఇంట్లో నోట్ల కట్టలు లభించిన విషయాన్ని ఇన్కమ్ టాక్స్ అధికారులకు,విదేశీ మద్యం లభించిన విషయాన్ని ఎక్సైజ్ శాఖకు సమాచారం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.దీనిపై చట్టప్రకారం సంబంధిత అధికారులు కేసు నమోదు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.డీఎస్పీ భీమ్‌రెడ్డిపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ డీఎస్పీ స్పష్టం చేశారు.



# ఏ ముఖం పెట్టుకుని వచ్చారు..?






- యాదాద్రి ప్లాంట్ వద్ద జగదీశ్ రెడ్డిపై ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఫైర్
- రూ.25 వేల కోట్ల ప్లాంట్ రూ.36 వేల కోట్లకు ఎలా పెరిగింది
- రూ.16 వేల కోట్ల కాంట్రాక్టులపై లెక్కలు చెప్పాలి
- టెండర్ లేకుండానే బీహెచ్ ఈఎల్ కు కాంట్రాక్టు ఎలా
- గత పాలనలోని నిర్ణయాలకు సమాధానం చెప్పాలి

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ:**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ మరోసారి రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ప్లాంట్ వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, కాంట్రాక్టులు, పెరిగిన ప్రాజెక్టు వ్యయంపై పలు ప్రశ్నలు సంధించారు.

### రూ.11 వేల కోట్లు అదనంగా ఎలా.?

రూ.25 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన యాదాద్రి పవర్ ప్లాంట్ వ్యయం రూ.36 వేల కోట్లకు ఎలా చేరిందని బీఎల్ఆర్ ప్రశ్నించారు. అదనంగా పెరిగిన రూ.11 వేల కోట్లకు సంబంధించిన పూర్తి లెక్కలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు వ్యయం పెరగడానికి కారణాలేమిటో, తీసుకున్న నిర్ణయాలేమిటో వివరించాలని కోరారు.

### రూ.16 వేల కోట్ల కాంట్రాక్టులపై ప్రశ్నలు

రూ.16 వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను బినామీలకు అప్పగించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని లక్ష్మారెడ్డి కోరారు. టెండర్ ప్రక్రియ లేకుండానే బీహెచ్ఈఎల్‌కు కాంట్రాక్టు ఎలా అప్పగించారో చెప్పాలని ప్రశ్నించారు. ప్లాంట్‌కు సంబంధించిన ప్రతి కాంట్రాక్టు, నిర్ణయం, వ్యయంపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

### ఏటీఎం లా ఉపయోగించుకున్నారా.?

కాళేశ్వరం ప్రాజెక్టు తరహాలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను కూడా కొందరు 'ఏటీఎం'లా ఉపయోగించుకున్నారంటూ బీఎల్ఆర్ ఆరోపించారు. 2014కు ముందు, ఆ తర్వాత సంబంధిత నాయకుల ఆస్తుల వివరాలను అఫిడవిట్లతో సహా ప్రజల ముందుంచాలని సవాల్ చేశారు. తాను పైరవీలు, కాంట్రాక్టుల ద్వారా రాజకీయాల్లోకి రాలేదని, ప్రజల మధ్య నుంచి వచ్చిన వ్యక్తినని పేర్కొన్నారు.

### 250 కిలోమీటర్ల దూరం నుంచి బొగ్గు

ప్లాంట్‌కు ముడి బొగ్గు అందుబాటులో లేకపోవడంతో సుమారు 250 కిలోమీటర్ల దూరం నుంచి బొగ్గును తరలించాల్సి వస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దీంతో ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతోందన్నారు. అయినప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు.

### స్థానికులకు ఉద్యోగాలు దక్కలేదని ఆరోపణ

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్లాంట్‌లో స్థానికులకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని బీఎల్ఆర్ విమర్శించారు. స్థానికులకు దక్కాల్సిన ఉద్యోగాలను అప్పటి అధికార పార్టీకి చెందిన ఎంపీటీసీల కుటుంబ సభ్యులకు కేటాయించారన్న ఆరోపణలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### సమాధానం చెప్పకుండా ఎందుకు వచ్చారు.?

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి యాదాద్రి ప్లాంట్‌ను సందర్శించడంపైనా లక్ష్మారెడ్డి ఘాటుగా స్పందించారు. అధికారంలో ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలకు సమాధానం చెప్పకుండా ఇప్పుడు ప్లాంట్ వద్దకు 'ఏ ముఖం పెట్టుకుని వచ్చారు?' అని ప్రశ్నించారు. గత పాలనలో జరిగిన వ్యవహారాలపై వాస్తవాలను ప్రజల ముందుంచేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఎవరికీ భయపడేది లేదని స్పష్టం చేశారు.

### భూనిర్వాసితులకు న్యాయం

ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు న్యాయం చేస్తామని బీఎల్ఆర్ హామీ ఇచ్చారు. ప్లాంట్‌లోని ఐదు యూనిట్లను పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ప్రధానమని పేర్కొన్నారు.





# రైతుకు "క" నీళ్ల గోస.!

- వాన లేక పంట పోయింది.. వాన పడి పంట మిగలలేదు
- చేతికొచ్చిన పంటపై వరుణుడి పంజా.. కాపాడుకోలేక రైతన్న విలవిల
- ఆరుగాలం కష్టానికి వర్షం దెబ్బ.. పెట్టుబడులు కూడా దక్కని దుస్థితి
- అప్పులు చేసి సాగు.. కోతకొచ్చే వేళ కురుస్తున్న వర్షాలతో రైతుల్లో ఆందోళన

**గుర్రంపోడు, ప్రజా వాయిస్:** ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే వేళ వర్షం రైతన్నను వెంటాడుతోంది. నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలంలో ఇప్పటికే వర్షాల కారణంగా కొంత పంట నష్టపోయిన రైతులు.. మిగిలిన పంటనైనా ఇంటికి చేర్చుకుందామనుకునే సమయంలో మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట తడిసిపోతుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.దున్నకం నుంచి విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల వరకు వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టారు. పంట చేతికొచ్చి అప్పులు తీరుతాయని ఆశించిన సమయంలో వరుణుడు మరోసారి దెబ్బతీయడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. పంట తడిసి నాణ్యత కోల్పోతే కనీసం పెట్టుబడి కూడా చేతికి రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పంట కోసం అప్పులు చేశాం.. తీరా పంట చేతికొచ్చే సమయానికి వాన వెంటాడుతోంది. అప్పులు తీర్చడం మాట అటుంచితే పెట్టుబడులు కూడా తిరిగొచ్చే పరిస్థితి లేదు అంటూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

### ప్రభుత్వమే అండగా నిలవాలి

వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కాపాడుకోలేకపోతున్న తమ పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి తక్షణ సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.


# మత్తడి దూకిన ధర్మారం చెరువు - చెక్ డ్యామ్



**ప్రజా వాయిస్/అడ్డగూడూరు:** రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని ధర్మారం చెరువు, బిక్కేరు వాగులో నిర్మించిన చెక్ డ్యామ్ మత్తడి దూకుతున్నాయి. గత కొన్ని రోజులుగా వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి నీరు భారీగా చేరి మత్తడి దూకుతుండంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెక్ డ్యామ్ లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు పెరిగి పంట పొలాలకు సాగు నీరు పుష్కలంగా అందుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# అటకెక్కిన ఆర్టీఐ చట్టం..!





- ప్రశ్నిస్తే సమాధానం లేదు.. అప్పీల్ చేస్తే విచారణ లేదు!
- వికారాబాద్ లో ఆర్టీఐ చట్టం అమలు గాలికి
- ఫస్ట్ అప్పీళ్లకూ స్పందన కరువు..
- 20 అప్పీళ్లతో సమాచార కమిషన్ ను ఆశ్రయించిన హక్కుల నేత

**ప్రజావాయిస్/వికారాబాద్ బ్యూరో:**ప్రజలకు పారదర్శకత, జవాబుదారీతనం కల్పించేందుకు తీసుకొచ్చిన సమాచార హక్కు చట్టం–2005 (ఆర్టీఐ) అమలు తెలంగాణలో ప్రశ్నార్థకంగా మారిందని మానవ హక్కుల ప్రజా సంరక్షణ సేవా సంస్థ వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ షా మొహమ్మద్ హుస్సెని ఆరోపించారు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలోని విద్య, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో సమాచారం కోరిన దరఖాస్తులకు సకాలంలో స్పందన లేదని పేర్కొన్నారు.ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 7(1) ప్రకారం సాధారణంగా 30 రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉండగా, గడువులు దాటుతున్నా సమాధానాలు ఇవ్వడం లేదని, ఫస్ట్ అప్పీళ్లు దాఖలు చేసినా విచారణకు పిలవకుండా పెండింగ్‌లో ఉంచుతున్నారని హుస్సెని ఆరోపించారు. సెక్షన్ 19(6) ప్రకారం అప్పీళ్లను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, ఆచరణలో ఆలస్యం జరుగుతోందన్నారు.ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని సమాచార హక్కు భవన్‌లో తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించిన హుస్సెని.. ఒకేసారి 20 రెండో అప్పీళ్లను దాఖలు చేశారు. సమాచారాన్ని నిరాకరించిన లేదా ఆలస్యం చేసిన అధికారులపై ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.పి ఐ ఓ లు నిర్లక్ష్యం చేస్తే చట్టప్రకారం జరిమానా, అవసరమైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. సమాచారం ఎందుకు నిరాకరించారో నిరూపించే బాధ్యత అధికారులపైనే ఉంటుందని అన్నారు. ప్రతి అప్పీల్‌పై విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారం ప్రభుత్వ శాఖలు తమ కార్యకలాపాలు, నిధుల వినియోగం, పథకాల అమలుకు సంబంధించిన కీలక సమాచారాన్ని స్వచ్ఛందంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని గుర్తుచేశారు. ఈ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని, ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలో ఆర్టీఐ దరఖాస్తులు, ఫస్ట్ అప్పీళ్ల పరిష్కారంపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హుస్సెని హెచ్చరించారు.

# విద్యార్థుల అభ్యున్నతికే వసతి గృహాల నిర్మాణం

- మంత్రి గడ్డం వివేకానంద

**ప్రజా వాయిస్ - మంచిర్యాల** మంచిర్యాల జిల్లా లో విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద స్పష్టం చేశారు. గురువారం జైపూర్ మండల కేంద్రంలో రూ.1.81 కోట్ల సి.ఎస్.ఆర్. నిధులతో నిర్మించనున్న షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహ (ఎస్సీ హాస్టల్) నిర్మాణానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, పోలీసు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి వివేకానంద మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందులో భాగంగానే సోమనపల్లి గ్రామంలో రూ.200 కోట్లతో 2,500 మంది విద్యార్థులకు సకల సౌకర్యాలతో వసతి, నాణ్యమైన విద్య అందించేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు.

### విద్యా, ఉపాధి రంగాలకు పెద్దపీట:

కళాశాలల అభివృద్ధి: చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మౌలిక వసతుల కోసం రూ.2 కోట్లు, జూనియర్ కళాశాల కోసం రూ.1.50 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు.విదేశీ ఉద్యోగాలు: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు సింగరేణి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా జర్మనీ భాషలో ఉచిత శిక్షణ ఇచ్చి, విదేశాల్లో ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహిస్తామన్నారు.కొత్త గని ఏర్పాటు: స్థానిక యువతకు ఉపాధి కల్పించేందుకు ఆర్.కె. ఓ.సి. లో నూతన గని ఏర్పాటుకు శరవేగంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.




### రూ.70 కోట్లతో పుష్కర ఘాట్లు:

రాబోయే పవిత్ర గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం రూ.70 కోట్లతో ఘాట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. శంకుస్థాపన అనంతరం ఆయన స్థానిక కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి, విద్యార్థినులతో ముచ్చటించారు. ప్రభుత్వం తరపున వారికి స్కూల్ బ్యాగులు, బూట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిసిపి ఎగ్గడి భాస్కర్, స్థానిక ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర విద్యుత్ సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట

- కేటీపీపీ పవర్ ప్లాంట్ సందర్శనకు బీఆర్ ఎస్ నేతల తరలింపు
- విద్యుత్ కోతలు, ఉత్పత్తి తగ్గడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నేతలు.

**ప్రజా వాయిస్/పాలకుర్తి/సెప్టెంబర్ 24** జనగామ జిల్లా:భూపాలపల్లి కేటీపీపీ థర్మల్ పవర్ ప్లాంట్ సందర్శనకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపుతో ఆయన వెంట జనగామ జిల్లా బీఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి,దేవరుప్పుల మండల నాయకులు,కార్యకర్తలు తరలివెళ్లారు.విద్యుత్ కోతలు, కేటీపీపీలో ఉత్పత్తి తగ్గడంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.సింగరేణి బకాయిలు చెల్లించి విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని పల్లా సుందర్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకుడు బాబ్బూరి శ్రీకాంత్ గౌడ్,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షకార్యదర్శులు తీగల దయాకర్,చింత రవి,మండల నాయకులు ఏల సుందర్,కొల్లూరి సోమన్న,కోతి ప్రవీణ్,నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు గడ్డం రాజు,మండల యూత్ అధ్యక్షుడు నవీన్ నాయక్, మాచర్ల బాబు,తదితరులు పాల్గొన్నారు.





# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
వట్ పల్లి మండలం గౌతపూర్ గ్రామంలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసినట్లు గ్రామ సర్పంచ్ తలారి స్వప్న తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుందన్నారు పేదలు ఆకలితో అలమట్టించకూడదని ఉద్దేశంతో ఈ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టిందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోలైన ప్రతి ఒక్కరికి కార్డులు రావడం జరుగుతుందని రేషన్ కార్డులతో పాటు ప్రభుత్వపరంగా అంది అన్ని సంక్షేమ పథకాలు అందించడం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆజా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖలీల్. నాయకులు ఇస్మాయిల్, కాజా, పాశ మియా, షాదుల్, మబ్బుల్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



# హిందూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

**- జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ మాయ బ్రహ్మ నర్సింహా**

ప్రజావాయిస్/వికారాబాద్:
హిందూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా నిర్వహించాలని వికారాబాద్ సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ మాయ బ్రహ్మ నర్సింహా అన్నారు.గురువారం వికారాబాద్ పట్టణంలోని మాతా బాల భక్త సమాజం ఆధ్వర్యంలో మైసమ్మ గుడి, గణేష్ కట్ట వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహం వద్ద మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. నేటి యువత, పిల్లలు తల్లిదండ్రులను, గురువులను ఎల్లవేళలా గౌరవించాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు టి. సదానంద్ రెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ టి. శ్రీదేవి, కాలనీ వాసులు జగన్నాథ్ రెడ్డి, సామ నర్సిములు, బాలరాజ్, మోనిగారి పండరినాథ్, డాక్టర్ ఉజ్జ్వల్,భక్త జనం, తదితరులు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

**గణనాథుడికి ఘనంగా వీడ్కోలు**

మేడ్చల్, బోడుప్పల్ / ప్రజా వాయిస్:
చెనగచెర్లలోని ద్వారకా నగర్ ఫేజ్-1లో సైనిక్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు, నిత్య కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులు సంప్రదాయబద్ధంగా నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా వినాయకుడి ఆశీస్సులతో కాలనీలో సుఖశాంతులు, సంతోషం, ఐశ్వర్యం వెల్లివిరియాలని భక్తులు ప్రార్థించారు. నిమజ్జన వేడుకల్లో కాలనీ పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సందడి చేశారు.వినాయక నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలతో కాలనీ పరిసరాలు మార్మోగాయి. సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, వైభవంగా ముగిసింది.

ప్రజా వాయిస్



# బసిరెడ్డిపల్లిలో పోషణమాసం కార్యక్రమం

**హాజరైన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ, సర్పంచ్ తుడుం శ్రావణి రాకేష్**

పెద్దవూర,ప్రజా వాయిస్
పెద్దవూర మండలం బసిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఐసీడీఎస్ పెద్దవూర సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ పాల్గొని చిన్నారులు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను తల్లిదండ్రులకు వివరించారు.గ్రామ సర్పంచ్ తుడుం శ్రావణి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, ఇతర పోషకాహార పదార్థాలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. వాటి ద్వారా లభించే పోషక విలువలను వివరించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ రావుల విజయ (భర్త రమేష్), ఆశా వర్కర్, గర్భిణులు, బాలింతలు, పాఠశాల ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అంగన్‌వాడీ టీచర్ ఎస్. విజయలక్ష్మి, ఆయా నరసమ్మ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# యూనిఫామ్స్ పంపిణీ చేసిన కార్పొరేటర్ తోకల శ్యామణి రమేష్

ప్రజా వాయిస్ గోదావరిఖని
ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధికి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ కార్పొరేటర్ తోకల (ఆవుల) శ్యామణి రమేష్ సూచించారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన స్కూల్ యూనిఫామ్‌లను విద్యార్థులకు ఆమె చేతుల మీదుగా పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమానికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలు అందిస్తోందని, వీటిని ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు యూనిఫామ్ సెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్నరాణి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ తతిజా బేగం, ఉపాధ్యాయులు వి. శ్రీధర్, సంతోష్, వెంకట రాజం, రాజిరెడ్డి, సత్యనారాయణ, పి.డి. రమ్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# అలీఫ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు శిక్షణ పూర్తి

**శిక్షణా సర్టిఫికెట్ల పంపిణీ చేసిన సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్**



ప్రజా వాయిస్ మంథని
రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అలీఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా నిర్వహించిన కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం పోతారం గ్రామంలో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం గ్రామీణ వేదికగా ఘనంగా సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ఎడ్ల ఆదిత్య పటేల్ చేతుల మీదుగా అర్హులైన మహిళలకు శిక్షణా పూర్తయినట్లు ధ్రువీకరణ పత్రాలను (సర్టిఫికెట్లను) అందజేశారు.

**స్వయం సమృద్ధి వైపు మహిళలు ముందడుగు**

ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల ఆదిత్య మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత మహిళలు స్వశక్తితో నిలబడేందుకు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక శ్రద్ధతో అలీఫ్ సంస్థ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి పొందుతూ, కుటుంబానికి ఆర్థికంగా చేయూతగా నిలవాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో మహిళలకు మరిన్ని శిక్షణా కార్యక్రమాలు అందించి వారి ఉపాధికి బాటలు వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజిత తో పాటు స్థానిక వార్డు మెంబర్లు, కమ్యూనిటీ యానిమేటర్లు, గ్రామ సమాఖ్య ప్రతినిధులు మరియు శిక్షణ పొందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వర్ష బీభత్సం.. నీట మునిగిన పంటలు

**ఎడతెరిపిలేని వానలతో పొలాల్లోకి భారీగా చేరిన నీరు.. ఆందోళనలో రైతులు**



ప్రజా వాయిస్,చిలుకూరు:
సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో కురిసిన భారీ వర్షాలకు పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల్లోకి భారీగా నీరు చేరడంతో పంటలు నీటిలో మునిగిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే సాగు పనులు పూర్తిచేసుకుని పంటలు ఏపుగా పెరుగుతున్న సమయంలో భారీ వర్షాలు కురవడంతో పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిస్తే పంటలు దెబ్బతిని పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు.పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అలాగే మండలంలోని నీట మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంట నష్టాన్ని అంచనా వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు. వర్షాల తీవ్రత మరింత పెరిగితే పంట నష్టం భారీగా ఉండే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




# కేజీబీవీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మండల విద్యాశాఖ అధికారి గోలి శ్రీనివాస్**

ప్రజావాయిస్/సంస్థాన్ నారాయణపురం
యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అటెండర్,స్వీపర్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి గోలి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.రెండు పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 45 ఏళ్లు కలిగిన వారు అర్హులని ఆయన పేర్కొన్నారు.నారాయణపురం మండల స్థానిక అభ్యర్థులకు నియామకాల్లో మొదటి ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.అర్హులైన అభ్యర్థులు తమ విద్యా అర్హతలు, ధ్రువీకరణ పత్రాల దరఖాస్తుకు జత చేసి ఈ నెల 25 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎం. ఆర్. సి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.



# భారీ వర్షాలకు పాలేరు నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..!! తహసీల్దార్ ఎం. వెంకన్న

మోతె సెప్టెంబర్/ ప్రజా వాయిస్
బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాలేరు నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మోతె తహసీల్దార్ ఎం. వెంకన్న సూచించారు.మోతె మండల పరిధిలోని పాలేరు నది తీర గ్రామాలైన తుమ్మగూడెం, ఉర్లుగొండ, నరసింహాపురం, నేరడవాయి గోపతండా, రంగాపురం తండా, రావికుంట తండా తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.భారీ వర్షాల కారణంగా పాలేరు నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప నదులు, వాగులు, వంతెనల వద్దకు వెళ్లవద్దని సూచించారు. ముఖ్యంగా నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో వంతెనలు, కల్వర్టులు దాటే ప్రయత్నం చేయరాదని హెచ్చరించారు.తహసీల్దార్ ఎం. వెంకన్న పాలేరు నదిలో ప్రవాహ పరిస్థితిని నరసింహాపురం వంతెన వద్ద పరిశీలించారు. రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో గ్రామ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహాపురం గ్రామ సర్పంచ్ వాంకుడోత్ బేబీ గోదా ,ఆర్ ఐ లు కరుణాకర్ రెడ్డి ,రమేష్, జిపిఓ గంగులు, కార్యదర్శులు బక్కయ్య, ఉపేందర్, తదితరులు



# 27న బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఈ నెల 27న మధ్యాహ్నం 12.30 గంటలకు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షా భూమిలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా సమావేశం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమావేశంలో జిల్లా కమిటీ మార్పులు, గత కార్యక్రమాల సమీక్ష, జమా ఖర్చుల పరిశీలనతో పాటు ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఉత్తర తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గడపాలే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞ కుమార్ రత్న జాడే హాజరుకానున్నారు. బౌద్ధులు, అంబేద్కర్‌వాదులు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.



# కన్నెపల్లిలో విద్యుత్ సమస్యలు

### ఏఈకి వినతినిచ్చిన సర్పంచ్ మోర్లె పార్వతి

**ప్రజా వాయిస్ కౌటాల**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో విద్యుత్ సమస్యలపై సర్పంచ్ మోర్లె పార్వతి గురువారం కౌటాల విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందజేసింది. చీపురుదుబ్బ లైన్ పాతది కావడంతో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతోంది. ఈ ఒక్క లైన్‌పై నాలుగు గ్రామాలు ఆధారపడి ఉండటంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. గ్రామంలోని పలు వీధుల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో స్తంభాలు లేకపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలు, పాఠశాల విద్యార్థుల భద్రత దృష్ట్యా కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరింది. చీపురుదుబ్బ లైన్ సమస్య, తక్కువ వోల్టేజీ, వేలాడుతున్న తీగలు, స్తంభాల కొరత, త్రీఫేజ్ సరఫరా, ఏబీ స్విచ్ ఏర్పాటు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను సర్పంచ్ మోర్లె పార్వతి కోరింది.



# వర్ధన్నపేట పిఏసిఎస్(పాక్స్) చైర్మన్ గా అబ్బిడి రాజీరెడ్డి

**ప్రజా వాయిస్/వర్ధన్నపేట**
వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండల కేంద్రంలోని డిసిసిబి బ్యాంకు ఆవరణలో వర్ధన్నపేట మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పాక్స్) నూతన చైర్మన్‌గా అబ్బిడి రాజీరెడ్డి అత్యంత వైభవంగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. వారితో పాటు ఫ్యాక్స్ నూతన డైరెక్టర్లు కూడ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి వర్ధన్నపేట ఏఎంసి చైర్మన్ నరుకుడు వెంకటయ్యకాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పోషల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రసిడెంట్ ఈగ దామోదర్ పర్వతగిరి సొసైటీ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, చౌటపెల్లి సొసైటీ చైర్మన్ అత్త కుమార్ స్వామి ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్ మరియు కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు ప్రతి భానుప్రసాద్ మరియు మండలంలోని సర్పంచ్ లు, మండల నాయకులు,సహకార రంగ ప్రముఖులు, రైతులు, రాజకీయ నాయకులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ అబ్బిడి రాజీరెడ్డి మాట్లాడుతూ...మండలంలోని రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు.రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు, విత్తనాలు అందేలా చూస్తామని, పిఏ సిఎస్ (ౖాౖజూ) అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తామని స్పష్టం చేశారు. తమ ఎన్నికకు సహకరించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు కు ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు,సహకార సంఘం సభ్యులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చైర్మన్‌ను పలువురు నాయకులు, రైతులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కందిక ఎల్లమస్వామి చిదుముల్ల భాస్కర్ తాటికాయల కుమారస్వామి పాల్గొన్నారు.

# వాన ముప్పు..అప్రమత్తం.!

**కోదాడ డివిజన్‌లో ఎడతెరిపిలేని వర్షాలు..**
**అత్యవసరమైతేనే బయటకు రావాలి**
**వాగులు, చెరువులు, కాలువల వైపు వెళ్లొద్దు..**
**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
**పరిస్థితిని పర్యవేక్షిస్తున్న పోలీసులు..**
**అత్యవసరమైతే వెంటనే సమాచారం ఇవ్వాలి:**
**కోదాడ డి.ఎస్పి శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజా వాయిస్,కోదాడ:**
ఆకాశం మేఘావృతం.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు.. ఎక్కడ చూసినా వరద నీటి ప్రవాహాలు.. ఈ నేపథ్యంలో కోదాడ డివిజన్ పరిధిలో పోలీసులు అప్రమత్తమయ్యారు. వర్షాల తీవ్రత దృష్ట్యా ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వాగులు, చెరువులు, కాలువలు, కల్వర్టులు, వరదనీరు ప్రవహించే ప్రాంతాల వైపు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. వర్షాల సమయంలో రాకపోకలు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలని కోరారు.

**ప్రజల భద్రతే ప్రథమం**
భారీ వర్షాల నేపథ్యంలో డివిజన్ పరిధిలో పరిస్థితిని పోలీసులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని డీఎస్పీ



శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తినా, వరదల కారణంగా ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి వర్షాల సమయంలో అనవసరంగా బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు.



# విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిమర్జణం..

ప్రజా వాయిస్, మానకొండూర్ ( సెప్టెంబర్ 23 ):
కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో గణపతి మహా నిమర్జన ఘట్టం విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.. మహిళలు, పురుషులు, పిల్లలు సంప్రదాయ వస్త్రాలను ధరించి నృత్యాలతో సంతోషంగా గడిపి ఎలాంటి అవాంచనీయ ఘటనలకు తావివ్వకుండా విగ్నేషుణ్ణి నిమర్జనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు రాపాక జగన్ మాట్లాడుతూ ఆ గణనాథుడి ఆశీర్వాదంతో ప్రజలందరూ ఆయురాగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరు జీవితంలో ఆ గణనాథుడు నీర్విఘ్నాలు తొలగించాలని విజయాలను అందజేయాలని కోరుకున్నారు.. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాపాక పెద్ద ఎల్లయ్య,ఈశ్వర్, రంగస్వామి,లక్ష్మణ్,రవీందర్,పులిపాక నరేష్, పారునంది ఎల్లయ్య,రాపాక శంకరయ్య, రంగస్వామి,జంగం అంజన్న, నాగరాజు, ఆంజన్న, అజయ్, పారునంది ఆంజనేయులు, రాపాక రాజేందర్, సంజయ్, హరీష్, దుర్గ ప్రసాద్, సంజయ్, శ్రవణ్, పారునంది అరవింద్, రాపాక సాత్విక్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు..

# జాతి విముక్తి కోసం గొప్పగా తీసిన సినిమా ప్యారడైజ్

**కేసీఆర్ పోలిన పాత్ర ఉండటం అద్భుతం**
**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**ప్రజా వాయిస్ , గోదావరిఖని :**
జాతి విముక్తి కోసం పోరాడిన ప్రజల పోరాటాన్ని చక్కగా చూపించిన సినిమా ప్యారడైజ్ అని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. గురువారం గోదావరిఖనిలో బిఆర్ఎస్ నేతలతో కలిసి పారడైస్ సినిమాని వీక్షించారు. అనంతరం మాట్లాడుతూ..గోదావరిఖని ప్రాంతానికి చెందిన డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ప్యారడైజ్ మూవీని అద్భుతంగా తీశారని, సినిమా చాలా అద్భుతంగా ఉందని అన్నారు. సినిమాలో చూపించిన జాతి విముక్తి పోరాటాలు ప్రత్యక్షంగా తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో చూసామని, తెలంగాణ ఉద్యమ రోజుల గుర్తుకు వచ్చాయని, సినిమాలో కెసిఆర్ పోలిన పాత్ర చాలా బాగుందని అన్నారు. సినిమాలో పాత్రలు సన్నివేశాలు హీరో నటన చాలా బాగున్నాయని, గోదావరిఖనికి పేరు చేస్తున్న దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు అభినందనలు తెలిపారు.



# మట్టి గణపతికి ఘనంగా నిమజ్జనం

### పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలే మేలు
### రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

**ప్రజా వాయిస్//**
రాజేంద్రనగర్: కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సన్నాయి వాయిద్యాల నడుమ విగ్రహాన్ని ఊరేగించి,తన తండ్రి తోకల శ్రీశైలం రెడ్డి,ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ నేతలు కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటి కొలనులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని వినాయకుడిని ప్రార్థించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా,డివిజన్ స్థాయి నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం గణనాథుడికి ఘనంగా వీడ్కోలు

**మేడ్చల్ జిల్లా / ప్రజా వాయిస్:**
చెనగచెర్లలోని ద్వారకా నగర్ ఫేజ్-1లో సైనిక్ యూత్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో, నిష్ఠగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. వినాయకుడి ఆశీస్సులతో కాలనీలో సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులు నెలకొనాలని భక్తులు ప్రార్థించారు. నిమజ్జన కార్యక్రమంలో కాలనీకి చెందిన పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తుల జయజయధ్వానాలు, వినాయక నామస్మరణలతో కాలనీ పరిసరాలు సందడిగా మారాయి. సాంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ నిమజ్జన కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# జాడలేని గజ ఈతగాళ్లు...

**- కనీస జాగ్రత్త తీసుకోని అధికారులు**
**- విద్యుత్ షాక్కు గురై చికిత్స పొందుతున్న బాధితులను పరామశించని ఎస్పీ**
**- జోగిపేట చెరువు వద్ద కనిపించిన లోపాలు**

ప్రజా వాయిస్,సంగారెడ్డి :
వినాయక నిమజ్జనం సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని స్వయంగా జిల్లా ఎస్పీ పర్వస్ పంకజ్ వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ కింది స్థాయి సిబ్బందికి సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడ కూడా సిబ్బంది ఎస్పీ సూచనలను అమలు చేయడం లేదు. దీనికి నిదర్శనం జోగిపేటలోనీ వినాయక నిమజ్జనం కోసం అధికారులు చేసిన ఏర్పాట్లు లోపాలు స్పష్టంగా కనిపించాయి. చెరువు కట్ట వద్ద ఎక్కడికక్కడ తేలిన విద్యుత్ వైర్లు... నిమజ్జన ప్రదేశంలో గజ ఈతగాళ్లు లేకపోవడం ఎస్పి 10 కిలో స్పష్టంగా కనిపించింది. దాంతోపాటే ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని హెచ్చరించిన జోగిపేట పోలీసులు అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారు. ఇది ఇలా ఉంటే గత రెండు క్రితం వినాయక నిమజ్జనం సందర్భంగా ఆందోల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులకు విద్యుత్ షాక్ తగిలింది. వారిలో ఒకరు జోక్ పేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరో ఇద్దరు సంగారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమజ్జన సందర్భంలో విద్యుత్ శాఖ గురై సికిత్స పొందుతున్న వారిని మాత్రం జిల్లా ఎస్పీ జోగిపేటకు వచ్చినప్పటికీ వారిని పరామర్శించకపోవడం విచారకరం. కేవలం నిమజ్జన ఏర్పాట్లు పేరుతో జిల్లా పర్యటనలు చేయడం తప్ప నిర్లక్ష్యంగా వివరించే అధికారులపై ఇంతవరకు చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడ కనిపించలేదు. జై పేటకు వచ్చిన ఎస్పీ బాధితులను పార్మర్శించకపోవడం పట్ల పలు విమర్శలు ఉన్నాయి.



# అంగరంగ వైభవంగా కామారెడ్డి వినాయక నిమజ్జనం

**ముంబయి తర్వాత అట్టహాసంగా కామారెడ్డి శోభాయాత్ర**

**జిల్లా కేంద్రంలో 400 గణపతి మండపాల ఏర్పాటు**

**వేలాదిగా నిమజ్జన వేడుకల దర్శనం**

**నాసిక్ డోల్ డప్పు కోలాటాలు బృంద నృత్యాలతో దద్దరిల్లిన కామారెడ్డి**

**48 గంటల పాటు నృత్యాలతో శోభాయాత్ర నిమజ్జనం**

**భారత వనిలో బొంబాయి తర్వాత అట్టహాసంగా ఘనంగా కొనసాగే కామారెడ్డి శోభాయాత్ర**

**విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో 47 వ వార్షికోత్సవ స్వాగత వేదిక**

**వర్షంతో నిమజ్జన ఊరేగింపు అంతరాయం**

**బొజ్జ గణపయ్య గణపతి బొప్పా మోరియా మార్మోగిన నినాదాలు**

**ప్రభుత్వ అడ్వైజర్ షబ్బీర్ ఆలీ అన్నదానం**

**చెమటోడ్చిన ప్రభుత్వ ఉద్యోగాలు**

ప్రజావాయిస్ కామారెడ్డి/

ప్రతి ఏడాది లాగా ఈ సారి గణేష్ నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. శోభాయాత్ర లో 400 గణపతి మండపాలలో ఆదిదేవుణ్ణి సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాలు, ఫ్లడ్ లైట్లు, నాసిక్ డోల్,



డప్పు వాయిద్యాలు కోలాటాలు బృంద నృత్యాలతో తీరొక్క పూలతో పూజలు డాన్సులతో కామారెడ్డి జిల్లా కేంద్రం దద్దరిల్లింది. నిమజ్జనం పురస్కరించుకుని టోటల్ కామారెడ్డి జిల్లా కేంద్ర వ్యాపార వాణిజ్య సంస్థలు బందు పాటించి వైభవంగా గణేష్ నిమజ్జన వేడుకలు జరుపుకొన్నారు. కిరాణా వర్తక సంఘం వ్యాపారులు మహిళలు పిల్లలు కోలాటాలు బృంద నృత్యాలతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎస్పీ రాజేష్ చంద్ర లు ధర్మశాల వద్ద గణేష్ నిమజ్జన యాత్ర ప్రారంభం చేశారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద 47 వ వార్షిక స్వాగత వేదిక ఏర్పాటు చేశారు.. ముంబై తర్వాత కామారెడ్డిలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభయాత్ర నిర్వహిస్తారు. నిమజ్జనం వేడుకలను వేలాదిమంది దర్శిస్తారు.నాసిక్ డోల్, డప్పు వాయిద్యాలు కోలాటాలు బృంద నృత్యాలతో తీరొక్క డాన్సుల తో ఊరేగింపు నిర్వహించారు. 48 గంటల పాటు నృత్యాలతో శోభాయాత్ర నిమజ్జనం వైభవంగా కొనసాగింది. యువత బృంద నృత్యాలతో ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. దేశంలో ముంబాయి తర్వాత అట్టహాసంగా కామారెడ్డి శోభాయాత్ర నిమజ్జనం చేపదాడటారు. కామారెడ్డి, పరిసర జిల్లాల ప్రజలు నిమజ్జన ఊరేగింపు వీధువేడుకలను తిలకిస్తారు.

***గురువారం నాడు వర్షంతో నిమజ్జన కార్యక్రమం కు అంతరాయము***

కలిగింది. వర్షాములో నృత్యాలు కొనసాగాయి. గణేష్ మహారాజ్ కి జై, బొజ్జ గణపయ్య, గణపతి బొప్పా మోరియా నినాదాలతో మార్మోగాయి.రైల్వే స్టేషన్ లో ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ ఆలీ అన్నదానం ఏర్పాటు చేశారు. మున్సిపల్, రెవెన్యూ పోలీస్ విద్యుత్ శాఖల అధికారులు ఉద్యోగులు చెమటోడ్చి విధులు చేశారు. 400 గణేష్ మండపాల నిర్వహణకు సంఘాలు యువకులు కోట్లాది రూపాయలు ఖర్చు చేశారు. ప్రజలు యువకులు మహిళలు చిన్నారులు వేల సంఖ్యలో తరలి వచ్చి శోభాయాత్ర నిమజ్జనం తిలకించారు.టెక్రియల్ చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు

## బంగారు ఆభరణాల కోసం

# వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

**ఆభరణాల విక్రయంలో సహకరించిన మరో ఇద్దరు నిందితులు కూడా అరెస్ట్**

**ఎస్పీ నితికా పంత్**

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలం బూరుగూడ గ్రామంలో వృద్ధురాలిని హత్య చేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 4 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1,500 నగదు, రక్తపు మరకలు గల బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ వెల్లడించారు.బూరుగూడ గ్రామానికి చెందిన మేకర్తి మల్లక్క (80) తన ఇంట్లో ఒంటరిగా నివసించేది. ఆమెకు బంధువైన మేకర్తి ధనుంజయ్ (34, బూరుగూడ) మద్యం



అలవాటు, వ్యక్తిగత అవసరాల కోసం ఆమె బంగారు ఆభరణాలను దొంగిలించాలని పథకం వేశాడు. తనను గుర్తించే అవకాశం ఉందనే భయంతో ఆగస్టు 30న రాత్రి 10:30 గంటల సమయంలో ఆమె ఇంట్లోకి ప్రవేశించి బండరాయితో తలపై కొట్టి హత్య చేశాడు. బంగారు చెవి కమ్మలు తీసుకున్న అనంతరం బీరువా పగలగొట్టి విలువైన వస్తువుల కోసం వెతికాడు. మృతదేహాన్ని కర్రలతో కప్పి పరారయ్యాడు.చెవి కమ్మల విక్రయంలో నామేవత్ ప్రవీణ్ (22, టి.ఆర్.నగర్) సహకరించగా, రాపర్తి మహేష్ (28, టి.ఆర్.నగర్) వాటిని తన వద్ద ఉంచుకున్నాడు. అందుకు వచ్చిన నగదు మహేష్ ద్వారా ధనుంజయ్‌కు చేరింది.కేసు ఛేదనలో పాల్గొన్న ఆసిఫాబాద్ డీఎస్పీ బి.అశోక్, టౌన్ సీఐ బి.రవికుమార్, ఏఎస్ఐ భోజ గౌడ్, కానిస్టేబుళ్లు ప్రేమ్ కుమార్, శేషారావు, సాగర్‌లను ఎస్పీ నితికా పంత్ ఐపీఎస్ ప్రశంసించారు.



# లైన్‌గూడ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విద్యార్థుల ప్రతిభకు ప్రశంసలు**

ప్రజా వాయిస్ కగజ్ నగర్

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని లైన్‌గూడ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ కే. హరిత గురువారం ఆకస్మికంగా సందర్శించింది.విద్యా బోధన, విద్యార్థుల అభ్యసన స్థాయి, పాఠశాల పరిసరాలను పరిశీలించింది. విద్యార్థులతో ముచ్చటిస్తూ పాఠ్యాంశాలతో పాటు సాధారణ విజ్ఞానంపై ప్రశ్నలు అడిగింది. చిన్నారులు తడబాటు లేకుండా సమాధానాలు ఇవ్వడంతో కలెక్టర్ అభినందించి చాక్లెట్లు పంపిణీ చేసింది.తరగతి గదులు, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ పరిశుభ్రత, వాతావరణంపై సంతృప్తి వ్యక్తం చేసింది. పాఠశాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలని, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయునికి సూచించింది. పాఠ్యాంశాలను పుస్తకాలకే పరిమితం చేయకుండా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, సృజనాత్మకత పెంపొందించాలని సూచించింది.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) యూవరాజ్ మర్మాట్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హార్స్ చౌదరి, ఎంపీడీఓ ఉజ్వల్ కుమార్, ఎంఈఓ, స్థానిక సర్పంచ్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



# తెగుళ్ల ముంపు పొంచి ఉంది

**- పసుపు పంటను కాపాడేందుకు సకాలంలో చర్యలు చేపట్టాలి**

**- ఉద్యాన శాఖ అధికారి కమల**

**ప్రజావాయిస్/కోట్ పల్లి:**

పసుపు పంటలో పురుగులు, తెగుళ్ల నివారణకు రైతులు సకాలంలో తగిన చర్యలు చేపట్టాలని ఉద్యాన శాఖ అధికారి కమల సూచించారు. కోట్ పల్లి మండలం బర్వాద్ గ్రామంలో రైతు శ్రీశైలం సాగు చేస్తున్న 8 ఎకరాల పసుపు పంటను ఆమె గురువారం పరిశీలించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఆకులు తినే పురుగులు, ఆకు ఎండుతెగులు, ఆకుమచ్చ తెగులు, దుంపకుళ్లు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. పంటను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, లక్షణాలు కనిపించిన వెంటనే ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.పంట ఆరోగ్యకరమైన పెరుగుదలకు అవసరాన్ని బట్టి పోషకాలను వినియోగించాలని, పురుగుమందులు, పోషక ద్రావణాలను ఒకేసారి కలిపి పిచికారీ చేయకుండా విడివిడిగా వినియోగించాలని ఆమె స్పష్టం చేశారు. మందుల వినియోగంలో లేబుల్‌పై సూచించిన మోతాదులు, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని రైతులకు ఆమె సూచించారు.

# తినుబండారాల షాపులపై ఉక్కుపాదం

**తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఫుడ్ ఇన్స్పెక్టర్..**

**బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్‌హౌస్, క్లాసిక్ రెస్టారెంట్‌లో అధికారుల తనిఖీలు నిర్వహణ..**

ప్రజా వాయిస్ జహీరాబాద్:



సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్‌హౌస్, క్లాసిక్ రెస్టారెంట్‌లో మున్సిపల్ కమిషనర్ జి. ప్రభాకర్, అదేవిధంగా సంగారెడ్డి ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఆహార భద్రత, పరిశుభ్రత ప్రమాణాల అమలును పరిశీలించారు.బిగ్ మిశ్రా దూద్‌పేడా స్వీట్‌హౌస్‌లో గడువు ముగిసిన మోతీచూర్ లడ్డూలను నిల్వ చేసి విక్రయిస్తున్నారన్న ఫిర్యాదు అందడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ ఆహార పదార్థాలను పరిశీలించడంతో పాటు వాటి గడువు తేదీలు, నిల్వ చేసే విధానం, పరిసరాల పరిశుభ్రత, ఆహార భద్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు.అనంతరం క్లాసిక్ రెస్టారెంట్‌లోనూ అధికారులు పరిశీలన చేపట్టి వంటగది, ఆహార పదార్థాల నిల్వ విధానం, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా రెండు సంస్థల నిర్వాహకులకు అధికారులు పలు సూచనలు చేశారు. ఆహార భద్రత, పరిశుభ్రత, పారిశుధ్య నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, గడువు ముగిసిన లేదా ప్రజల ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలను నిల్వ చేయడం, విక్రయించడం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించేలా నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు..

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన

# నాగరాజుకు పరామర్శ..

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:**



"రోడ్డు ప్రమాదంలో గాయపడి మిర్యాలగూడ పట్టణంలోని వర్షిత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఎలుగుబెల్లి నాగరాజును మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి గురువారం పరామర్శించారు.నాగరాజు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న జగదీష్‌రెడ్డి.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఆసుపత్రికి చేరుకుని నాగరాజు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

# బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు

**పాముల సంచారంతో ప్రజల భయందోళన!**

ప్రజా వాయిస్ బెల్లంపల్లి రూరల్



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయి ఉండటంతో అక్కడికి వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్యాలయ పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా పాములు, ఇతర విషపూరిత జీవులు సంచరించే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.తహసీల్దార్ కార్యాలయానికి ప్రతిరోజూ వివిధ పనుల నిమిత్తం వందలాది మంది ప్రజలు వచ్చి వెళ్తుంటారు. ఇలాంటి రద్దీ ప్రాంతంలో పిచ్చిమొక్కలు, పొదలు తొలగించకుండా ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ఎదురవుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను వెంటనే తొలగించాలని ప్రజల తరఫున ఉన్నతాధికారులు . సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# అర్ధరాత్రి దొంగల బీభత్సం

**- లక్ష్మీనారాయణపూర్ లో 1.25 లక్షలు ఆవహరణ**

**- సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన చోరీ ఘటన**

యాలాల్/ప్రజా వాయిస్:




యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా లో బుధవారం అర్ధరాత్రి దొంగలు భీమస్థం చేశారు రూ.1 .25 వేలు నగదును అవహరించేందుకు పోయారు. యాలాల్ ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీ నారాయణపూర్ చౌరస్తాలోనీ శ్రీనివాస్ సూపర్ మార్కెట్ యజమాని బుధవారం రాత్రి వరకు వ్యాపారం నిర్వహించాడు. ఎప్పటిలాగే తన మార్కెట్ ను మూసి ఇంటికి వెళ్ళాడు. గురువారం ఉదయం వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు మార్కెట్ లోకి దూరి కౌంటర్ లో ఉన్న 1.25 వేల నగదును ఎత్తుకెళ్లారు. యజమాని నర్సింలు గురువారం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనను పరిశీలించిన పోలీసులు దొంగలను పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేశారు. టవర్ డంప్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. 24 గంటలో దొంగలను పట్టుకొని సొత్తును రికవరి చేస్తామని యాలాల్ ఎస్ఐ విఠల్ రెడ్డి తెలిపారు.బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.యాలాల మండల పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.



# ఎన్కతలలో రాజకీయ ఆసక్తి రేపిన భేటీ!

**- కట్టెల మల్లేష్‌కు బహుజన సమాజ్ పార్టీ ఆహ్వానం!**

**- సానుకూలంగా స్పందించిన అంబేద్కర్ ప్రజా సంఘం వ్యవస్థాపకుడు**

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం ఎన్కతల గ్రామంలో అంబేద్కర్ ప్రజా సంఘం వ్యవస్థాపకులు కట్టెల మల్లేష్‌ను బహుజన సమాజ్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలవడం స్థానికంగా ఆసక్తిని రేపింది. ఈ సందర్భంగా కట్టెల మల్లేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, బహుజన సమాజ్ పార్టీలోకి రావాలని నేతలు ఆహ్వానించారు.బహుజన సమాజ్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కలిసి పనిచేయాలని నేతలు కోరారు. పార్టీ నేతల ఆహ్వానంపై కట్టెల మల్లేష్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాలుగో జోన్ ఇన్‌చార్జి అంతటి నాగన్న, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి సయ్యద్ అమీర్, కొడంగల్ అసెంబ్లీ ఇన్‌చార్జి యు. రమేష్ బాబు, వికారాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు మహేందర్, కొడంగల్ అసెంబ్లీ అధ్యక్షులు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎం. వెంకటేశం, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఖమ్మంలో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు

### ఆసిఫాబాద్‌లో పోస్టర్ల విడుదల

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్
ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం జనకపూర్‌లో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ నాలుగో మహాసభల పోస్టర్లను గురువారం విడుదల చేశారు. ఈ మహాసభలు ఖమ్మంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలు రూపొందించుకునేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఏఐకేఎంఎస్ జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న వివరించారు. మహాసభలను విజయవంతం చేసేందుకు చెన్నూరు ప్రాంత రైతులు అధిక సంఖ్యలో ఖమ్మంకు తరలిరావాలని కోరారు. పంట ఉత్పత్తి వ్యయంపై 50 శాతం కలిపి కనీస మద్దతు ధర ఇచ్చిన హామీని అమలు చేయాలని, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలని, రుణమాఫీ, పంటల బీమా, ప్రకృతి వైపరీత్య నష్టపరిహారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని, అంత్యోదయ కింద 35 కిలోల బియ్యం విధానాన్ని కొనసాగించాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లు-2025పై ఆందోళన వ్యక్తం చేస్తూ, స్మార్ట్ మీటర్లు, ముందస్తు చార్జీలు రైతులపై భారం మోపకుండా చూడాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, పేదలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

## సింహగర్జన యూత్ 20వ వార్షికోత్సవం: గణనాథుని దర్శించిన సిద్ధిపేట సీపీ రష్మీ పెరుమాళ్

మిరుదొడ్డి ప్రజా వాయిస్


మిరుదొడ్డిలో సింహగర్జన యూత్ 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అత్యంత వైభవంగా ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో గురువారం ప్రత్యేక ఆకర్షణ నెలకొంది. ఈ వేడుకల్లో భాగంగా సిద్ధిపేట పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ముఖ్య అతిథిగా హాజరై గణనాథుని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సీపీ, ఉత్సవాలు దిగ్విజయంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. అనంతరం సింహగర్జన యూత్ సభ్యులు సీపీ రష్మీ పెరుమాళ్‌ను ఘనంగా సత్కరించి, తమ సమాజ సేవా కార్యక్రమాలు మరియు ఉత్సవాల నిర్వహణ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, గణనాథుని నిమజ్జన మహోత్సవాన్ని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, అత్యంత ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. నిమజ్జనం సమయంలో యూత్ సభ్యులు స్వచ్ఛందంగా వాలంటీర్లుగా బాధ్యతలు స్వీకరించి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని సీపీ సూచించారు. అల్లర్లు, గొడవలకు తావు ఇవ్వకుండా శోభాయాత్రను విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో సింహగర్జన యూత్ అధ్యక్షుడు లింగాల సదానంద రెడ్డితో పాటు దుబ్బాక సీఐ, మిరుదొడ్డి ఎస్ఐ, యూత్ సభ్యులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెండు దశాబ్దాలుగా సింహగర్జన యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలకు స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఈ సందర్భంగా నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.



# సమాజ సేవతోనే వ్యక్తిత్వ వికాసం

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 24:**
ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సమాజంపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మధు శ్రీవాస్తవ అన్నారు. జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సమాజం పట్ల సానుకూల ధోరణితో వ్యవహరిస్తూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, విశాల దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యం, పారిశుధ్యం, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం. మంగతా నాయక్, ఎం. సంపత్‌కుమార్, స్టూడెంట్ కౌన్సిలర్ శివకుమార్, అధ్యాపకులు రాజు, సుధాకర్,లక్ష్మీనారాయణ,దయానంద్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,నాగేశ్వరరావు,పవన్ కుమార్, సలీం,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




# భూసేకరణలోపారదర్శకత, నిష్పక్షపాతమే కీలకం

### అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాస ప్రయోజనాలు కల్పించాలి
### భూసేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పక్కాగా నమోదు చేయాలి: కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రజా వాయిస్, భూపాలపల్లి:
జిల్లాలో వివిధ అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో భూసేకరణ చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పులపై రెవెన్యూ అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్, సింగరేణి, జెన్‌కో, జాతీయ రహదారులు తదితర అభివృద్ధి ప్రాజెక్టులకు జిల్లాలో భూసేకరణ జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. అర్హులైన రైతులకు చట్టప్రకారం పరిహారం, పునరావాస ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తూ భూసేకరణలో జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. ఓఎస్‌డీ మనోహర్ మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. భూసేకరణలో ప్రతి దశను పక్కాగా నమోదు చేయడంతో పాటు అవసరమైన చోట వీడియో రికార్డింగ్ చేపట్టాలని తెలిపారు. అసైన్డ్, ప్రభుత్వ భూములకు సంబంధించిన వివాదాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, భూమి విస్తీర్ణం, రికార్డుల వివరాల్లో పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాటారం సబ్‌కలెక్టర్ సౌరవ్ శర్మ, ఆర్డీవో హరికృష్ణ, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ నవీన్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.




## తెలంగాణ ఉద్యమకారుల
# హక్కులను కాపాడాలి

**సెప్టెంబర్ 27న చలో యాదగిరిగుట్ట కార్యక్రమం**
**ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు, కేసుల ఎత్తివేతకు డిమాండ్**

ప్రజా వాయిస్, మొగుళ్లపల్లి: తెలంగాణ ఉద్యమకారులను మోసం చేస్తే సహించేది లేదని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి అన్నారు. ఈ నెల 27న యాదగిరిగుట్టలో నిర్వహించనున్న 'చలో యాదగిరిగుట్ట' కార్యక్రమానికి మండలంలోని మలిదశ తెలంగాణ ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. గురువారం మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఫోరం నాయకులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉద్యమ అమరవీరులకు నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యువత, విద్యార్థులు, రైతులు, కార్మికులు, సకల జనులు చేసిన పోరాటాలను గుర్తించి ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు కల్పించాలని, ఉద్యమ కాలంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల హక్కులు, సమస్యలపై చర్చించేందుకు సెప్టెంబర్ 27న యాదగిరిగుట్టలోని లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రాంగణంలో సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బత్తిని శ్రీహరిగౌడ్, గాలి చంద్రమౌళి, తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి, గుర్రపు అన్నారెడ్డి, గుడిమల్ల రమేష్, ఉడుత మల్లయ్య, కుమ్మరి సారయ్య, మంగళపల్లి శ్రీనివాస్, పావురాల రాజయ్య, బండారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా ఎన్నికలకు 31 నామినేషన్లు

### ఎన్నికల అదికారి రాంమోహన్

**ప్రజావాయిస్ కామారెడ్డి/**


ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. మొత్తం 15 మేనేజింగ్ కమిటీ సభ్యుల పదవులకు 31 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 25న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 26న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

# క్యాన్సర్ బాధితురాలికి కౌన్సిలర్ దండు సారయ్య ఆపన్నహస్తం

### రూ.10వేల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్న జననేత దండు సారయ్య



ప్రజావాయిస్, ఇల్లందు(సెప్టెంబర్24):పట్టణంలోని జేకే కాలనీకి చెందిన శ్రీవల్లి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యపరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమెకు క్యాన్సర్ మూడోదశలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న శ్రీవల్లి కుటుంబానికి క్యాన్సర్ చికిత్స మరింత భారంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఇల్లందు మున్సిపాలిటీ బిఆర్ఎస్ పార్టీ 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య మానవతా దృక్పథంతో స్పందించి తనవంతు సహాయంగా రూ.10వేల ఆర్థికసహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి చికిత్స కొనసాగించేందుకు అండగా ఉంటామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా దండు సారయ్య మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. శ్రీవల్లి క్యాన్సర్ చికిత్సకు మరింత ఆర్థికసహాయం అవసరముందని దాతలు, సేవాసంస్థలు, మానవతావాదులు ముందుకువచ్చి తమకు తోచినంత సహాయం అందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. క్యాన్సర్‌తో పోరాడుతున్న శ్రీవల్లి చికిత్సకు సహాయం చేయదలచిన దాతలు ఫోన్‌పే, గూగుల్‌పే నంబర్ 9391522612 కు తమకు తోచిన ఆర్థికసహాయం అందించాలని దండు సారయ్య విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే స్పందించి ఆర్థికసాయం అందజేసిన మానవతామూర్తి, జననేత సారయ్య అని పట్టణ ప్రజలు కొనియాడారు.



# వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

### - గణనాథుడిని దర్శించుకున్న సీఐ లతీఫ్

**ప్రజా వాయిస్ దౌల్తాబాద్, సెప్టెంబర్ 24:**
దౌల్తాబాద్ మండల కేంద్రంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొగుట సీఐ ఎస్.కె. లతీఫ్ గణనాథుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గణేష్ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు యువత ఐకమత్యంతో ముందుకు సాగడం అభినందనీయమన్నారు. ఉత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు, యువత శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించుకోవాలని, నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. వివేకానంద యూత్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివేకానంద యూత్ సభ్యులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం

**ప్రజా వాయిస్/చర్ల:**


ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చర్ల సర్పంచ్ పూజారి సామ్రాజ్యం సూచించారు. వర్షాల తీవ్రత దృష్ట్యా అత్యవసర పనులు ఉంటే తప్ప ప్రజలు బయటకు రావద్దని, ప్రయాణాల సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు అవసరం లేకుండా బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, చెట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, కాలువలు దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ప్రజలకు ఏదైనా అత్యవసర సమస్య ఎదురైతే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామపంచాయతీ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉంటారని సర్పంచ్ తెలిపారు. వర్షాలు తగ్గే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షితంగా ఉండాలని సర్పంచ్ పూజారి సామ్రాజ్యం విజ్ఞప్తి చేశారు.

## క్రీడలకు పెద్దపీట.. గ్రామీణ ప్రాంతాల నుంచే

# అంతర్జాతీయ క్రీడాకారులు తయారు కావాలి

**-డిండి జెడ్పీహెచ్ఎస్‌లో 70వ ఎస్‌జీఎఫ్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే బాలు నాయక్**

**-దేవరకొండ ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తా..**

**-నారిమళ్ల ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణం సాధించడం మన ప్రాంతానికే గర్వకారణం**



ప్రజా వాయిస్ /డిండి

విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. డిండి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన 70వ దేవరకొండ నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్ -- సెలెక్షన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలు నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో ఈ పోటీలు సెప్టెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహిస్తున్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభం ముందుగా ఎమ్మెల్యే బాలు నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొని క్రీడాకారులకు ఉత్సాహం కల్పించారు. అనంతరం పీఈటీలు, ఉపాధ్యాయులతో కలిసి క్రీడా మైదానానికి చేరుకుని రిబ్బన్ కట్ చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థులతో మమేకమై క్రీడల ప్రాధాన్యతపై మాట్లాడారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో తదితర క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడా ప్రతిభను వెలికితీయాలి. ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ..విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ దాగి ఉంది. అలాంటి ప్రతిభను పాఠశాల స్థాయి నుంచే గుర్తించి సరైన శిక్షణ అందించాలి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యత ఇస్తోందని, రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతులు, శిక్షణ, క్రీడా ప్రతిభను అభివృద్ధి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం 2025లో ప్రత్యేక క్రీడా పాలసీ తీసుకొచ్చింది. గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించి ప్రతిభను గుర్తించే విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేస్తా..దేవరకొండ నియోజకవర్గ ప్రాంతం అంటేనే క్రీడలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ప్రాంతం నుంచి మరింత మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు రావాలి. అందుకు అవసరమైన వసతులు కల్పించేందుకు నా వంతు కృషి చేస్తాను. దేవరకొండ ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేయడానికి కృషి చేయడం నా బాధ్యత అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. క్రీడాకారులకు శిక్షణ, మౌలిక వసతులు, కోచ్‌ల సహకారం అందితే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగగలరని పేర్కొన్నారు. డిండి బిడ్డ నారిమళ్ల ప్రవల్లికకు అభినందనలు అని అన్నారు. మన డిండి ప్రాంతానికి చెందిన నారిమళ్ల ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో భారత జట్టు తరపున స్వర్ణ పతకం సాధించడం మనందరికీ గర్వకారణం అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. 2026 ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చైనాలోని ఒర్డోస్‌లో జరిగిన మహిళల 4ఐ400 మీటర్ల రిలేలో నారిమళ్ల ప్రవల్లిక సభ్యురాలిగా ఉన్న భారత జట్టు 3:33.62 నిమిషాల్లో స్వర్ణ పతకం సాధించింది. ప్రవల్లిక నల్లగొండ జిల్లాలోని డిండి మండలానికి చెందిన క్రీడాకారిణిగా, డిండి గురుకుల స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందినట్లు నివేదికలు పేర్కొన్నాయి. క్రీడా విశ్వవిద్యాలయం.. స్పోర్ట్స్ అకాడమీలకు ప్రాధాన్యం, రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీలు, ఆధునిక క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. 2026లో రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఒలింపిక్స్, కామన్వెల్త్ స్థాయి శిక్షణ అందించేలా క్రీడా మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారికంగా వెల్లడించింది. క్రీడా రంగానికి బడ్జెట్‌ను గత కేటాయింపులతో పోలిస్తే 16 రెట్లు పెంచినట్లు ప్రభుత్వం 2025లో వెల్లడించింది. అలాగే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు అందిస్తున్నట్లు తెలిపింది.

**పాఠశాలల్లో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత**

ప్రతి పాఠశాలలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం విద్యాశాఖ సమీక్షలో స్పష్టం చేసింది. విద్యార్థుల్లో క్రీడా ఆసక్తిని పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న క్రీడా మైదానాలు, పరికరాలు, శిక్షణా వసతులను సమర్థంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చదువులోనూ, ఆటల్లోనూ విద్యార్థులు రాణించాలి. ఈరోజు పాఠశాల మైదానంలో ఆడే విద్యార్థుల్లోనే రేపటి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు ఉంటారు. అందుకే ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం అందేలా కృషి చేస్తాం"లి అని బాలు నాయక్ అన్నారు. కార్యక్రమంలో దొంతినేని వెంకటేశ్వర్ రావు, ముత్యాల శశిధర్ రెడ్డి, నల్లగంతుల రవి, హనుమంతు వెంకటేష్ గౌడ్, మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, విద్యాశాఖ అధికారులు, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## యువత క్రీడాలాపై ఆసక్తి కనబర్చాలి

**రాష్ట్రస్థాయి కబడ్డీకి సంగారెడ్డి బాలికల జట్టుఎంపిక**

**క్రీడాకారులను ప్రోత్సహించిన చైర్మన్ కుమార్ గౌడ్**

**జిన్నారం ప్రజావాయిస్**

సిరిసిల్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అండర్-19 కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు సంగారెడ్డి జిల్లా బాలికల జట్టు ఎంపికైంది. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం వార్డు కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి శిక్షణ అందించారు. శిక్షణ సమయంలో క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అక్కడే వసతి, భోజన సౌకర్యాలు కూడా కల్పించారు. రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధమవుతున్న బాలికల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపాని కుమార్ గౌడ్ తన సొంత నిధుల నుంచి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ ఆర్థిక సహాయాన్ని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ చేతుల మీదుగా జట్టు సభ్యులకు అందజేశారు. సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికలు ప్రతిభ చాటి విజయం సాధించి సంగారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ చిమ్ముల సంధ్య, వార్డు కౌన్సిలర్లు పద్మ, మాధవి, విజయ లక్ష్మి, మురళి, కిషన్, కుమార్ గౌడ్, నాయకులు రాజు, క్రీడాకారులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గ్యారమి వేడుకలు

**తలకొండపల్లి జమ మసీద్ అధ్యక్షుడు మహమ్మద్ కాజా గౌస్ పాషా**

**తలకొండపల్లి ప్రజా వాయిస్ :**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో గర్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మత పెద్దల సమక్షంలో భక్తిశ్రద్ధలతో గ్యారమి జరుపుకున్నారు. తలకొండపల్లి జామా మసీద్ అధ్యక్షుడు మమ్మద్ ఖాజా పాషా గౌస్ పాషా ఆధ్వర్యంలో గ్యారమీ వేడుకలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గ్యారమి పండగను ప్రతి ధనికులు పేదవాళ్ళు అని బేధాలు లేకుండా ప్రతి ఒక్క కుటుంబాలలో ఆనందాలతో కలిగి ఉండాలని మహబూబ్ దర్గా భక్తిశ్రద్ధలతో ప్రతి ఒక్కరు జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహబూబ్ సాని దర్గా వద్ద ఫాతెహా నిర్వహించి పేదలకి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖాదర్ చాంద్ పాషా బాబా మహమ్మద్ హుజైఫ్ మహ్మద్ ఉబేద్ మమ్మద్ అయాన్ మహమ్మద్ రియాన్ సజ్జు పాషా అజీమ్ సల్మాన్ వాజిద్ యూసుఫ్ అల్తాఫ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పీఏసీఎస్‌కు కొత్త పాలకవర్గం

**- రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు!**

**- చైర్మన్‌గా నరోత్తం రెడ్డి.. వైస్ చైర్మన్‌గా మల్లారెడ్డి ప్రమాణ స్వీకారం**

**ప్రజావాయిస్/మోమిన్‌పేట్:**

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా నరోత్తం రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులు, డైరెక్టర్లు, రైతులు పాల్గొని చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వైస్ చైర్మన్‌గా మల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా డప్పు సుక్కమ్మ, సరోజనమ్మ, వెంకటేశం, కిష్టయ్య, చంద్రయ్య, ప్రభాకర్, కిష్టా రెడ్డి, దుర్గాప్రసాద్ రెడ్డి, సత్యప్రసాద్ గౌడ్, నౌషా నాయక్, మధుకర్ రెడ్డిలు బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గం మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని, సహకార సంఘం ద్వారా రైతులకు అందాల్సిన సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా పీఏసీఎస్ కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సంఘం అభివృద్ధికి సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు, సహకార సంఘం కార్యదర్శి యం.శేఖర్ ,సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు.....

**మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ముస్లిం సోదరుడు.....**




ప్రజా వాయిస్, పాపన్నపేట

పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడలో వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వీర గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జనోత్సవం లో వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన మమ్మద్‌అమీర్ రూ. 6 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అమీర్ ను ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. ఈ గణేష్ నిమజ్జనంలో భాగంగా కుర్తివాడలో పండగ వాతావరణం నెలకొంది. భక్తిశ్రద్ధలతో గణపతి నిమజ్జనం కార్యక్రమం జరిగింది

## భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

**ముంపు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి.**

**కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



ప్రజా వాయిస్,హనుమకొండ:

జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అధికారులతో నిర్వహించిన గూగుల్ మీట్‌లో వర్ష పరిస్థితులపై సమీక్షించారు. వేలేరు, ఆత్మకూరు మండలాల్లో బుధవారం అధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. గురు, శుక్రవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు, వంకలు, చెరువులు, రహదారుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గతంలో ముంపునకు గురైన ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. చెరువుల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, అవసరమైన చోట ఇసుక బస్తాలు, జేసీబీలు, ఇతర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాల్లో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల కారణంగా నష్టం జరిగితే తక్షణమే నివేదిక అందజేయాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## పట్టణ ప్రజలకే విద్యుత్ అవసరమా? పల్లె ప్రజలకు అవసరం లేదా.....

**రైతుల కన్నీటి ఆర్తనాధాలు..**

**ప్రజా వాయిస్, పాపన్నపేట**

పట్టణ ప్రజలకు అవసరమైన విద్యుత్, పల్లె ప్రజలకు అవసరం లేదా, పల్లెలు కూడా ఇదే రాష్ట్రంలో భాగమే. గ్రామీణ ప్రజలు కూడా ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు కూడా తమ పనులకు విద్యుత్ పై ఆధారపడుతున్నారు. అలాంటప్పుడు విద్యుత్ కోతల భారం ఎక్కువగా పల్లెలపైనే పడడంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**సమాన విద్యుత్ సరఫరా అందించాలి....**

**రైతుల ఆవేదన....**

ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ కోతల సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పల్లె ప్రజల అవసరాలను కూడా పరిగణలోకి తీసుకొని పట్టణాలు, గ్రామాలకు సమానంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని రైతులు మరియు విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు. విద్యుత్ మా హక్కు. పల్లెలకు కూడా సమాన హక్కు. పల్లెలను నిర్లక్ష్యం చేయకండి అని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని విద్యుత్ కోతను అరికట్టి పల్లె ప్రజలకు నాణ్యమైన విద్యుత్ను అందించాలని కోరుతున్నారు....





## బీజేపీ మండల అధ్యక్షులు నీలకంఠ పాండు జన్మదిన వేడుకలు.

**ప్రజా వాయిస్ తలకొండపల్లి :**

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తలకొండపల్లి మండల అధ్యక్షులు నీలకంఠ పాండు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నీలకంఠ పాండు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. బీజేపీని తలకొండపల్లి మండలంలో మరింత బలోపేతం చేసేందుకు నీలకంఠ పాండు నాయకత్వంలో పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తామని నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండలం లోని వివిధ గ్రామల నుండి బీజేపీ, బీజేవైఎం నాయకులు పెద్ద ఎత్తున విచ్చేసి నీలకంఠ పాండుకి శు భాకాంక్షలు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, పద్మ అనిల్ ముదిరాజ్, సర్పంచులు ఇమ్మిడి మహేష్, జినుకుంట్ల చంద్ర శేఖర్, ఉప సర్పంచ్ రాఘవేంద్,విజయ్ ఉశ్రీశైలం యాదవ్, జంగయ్య యాదవ్, బొల్లా శ్రీను, మనోహర్, పర్వతాలు, నరేందర్, ప్రవీణ్, అన్ని గ్రామల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# మామునూర్ విమానాశ్రయనీకీ Dr.B,R అంబేద్కర్ పేరు పెట్టాలి

**జన్ను నరసయ్య అంబేద్కర్ సంఘం. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు**


వర్ధన్నపేట ప్రజా వాయిస్
మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మామునూరు విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలో సూచించాలని ఎక్స్లో పోస్ట్ చేసినందున మేము మా సంఘంతో పాటు దళిత ప్రజాసంఘాలు కూడా మామునూరు అంతర్జాతీయ విమాన ఆశ్రమానికి అంబేద్కర్ పేరు పెడితే బాగుంటుందని కూడా మేము ముఖ్యమంత్రి కి తెలియజేస్తున్నాం ముఖ్యమంత్రి పూర్తిస్థాయిలో నిర్ణయాత్మకమైన నిర్ణయం తీసుకొని అంబేద్కర్ పేరు పెడితే తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్ను గౌరవించుకున్నట్లే నని మేము స్పష్టంగా తెలియజేస్తున్నాం. అలాగే అంతర్జాతీయ స్థాయిలో కూడా అంబేద్కర్ ను గౌరవిస్తున్నట్లు ప్రభుత్వానికి చక్కని గుర్తింపు కూడా తెస్తుందని భావిస్తున్నాం. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య, వరంగల్ జిల్లా ఇన్చార్జి తాటికాయల వివేకానంద. వరంగల్ జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్ మండల నాయకులు కొండేటి భాస్కర్ దమ్మన్నపేట ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో నేడు జరగాల్సిన అన్ని పరీక్షలు వాయిదా

**ప్రజా వాయిస్ హన్మకొండ / కాకతీయ యూనివర్సిటీ**
భారీ వర్షాల నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన పరీక్షలను తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

# కాజీపేటలో కన్నతల్లిని కడతేర్చిన కన్నకొడుకు.. కత్తితో దాడి..!

ప్రజా వాయిస్ హన్మకొండ / కాజీపేట



హన్మకొండ జిల్లా: కాజీపేట డీజిల్ కాలనీలో కన్నతల్లిని కొడుకు హత్య చేసిన ఘటన కలకలం రేపింది. తల్లికి వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో కుమారుడు దొరబాబు (20) ఆమెను పలుమార్లు హెచ్చరించినట్లు తెలుస్తోంది. తల్లి వైఖరి పై అనుమానంతో ఉదయ శ్రీ (40) పై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు సమాచారం. ఘటన పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎస్సై వెంకన్న మృతదేహానికి కాంగ్రెస్ నేత నివాళి

**రాయపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి**

ప్రజా వాయిస్/రాయపర్తి
రాయపర్తి: హైదరాబాద్ లో గణేశ్ నిమజ్జనం సందర్భంగా జరిగిన ప్రమాదంలో మృతిచెందిన ఎస్సై వెంకన్న అంత్యక్రియలు తన స్వగృహం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కృష్ణాపురం గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయపర్తి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి హాజరై వెంకన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు రాయపర్తి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి అంత్యక్రియలకు హాజరైనట్లు తెలిపారు.



# ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

**- బాధితులకు పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలి**

**- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య**

ప్రజా వాయిస్ సంగారెడ్డి :
జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు ప్రభుత్వం అందించే పరిహారం సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి సంక్షేమ శాఖలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులతో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, అట్రాసిటీ కేసులు, రోస్టర్ పాయింట్ల అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసుల పరిష్కారంపై కలెక్టర్, ఎస్పీలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, విచారణలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని చైర్మన్ సూచించారు. సిద్దిపేటలో మొబైల్ కోర్టు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని స్పెషల్ పబ్లిక్



ప్రాసిక్యూటర్ సత్యనారాయణకు సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి కోటా మేరకు ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై వారికి విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమాలకు అధికారులు, ప్రజలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ఆయా వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాలని, ఇతర అవసరాలకు మళ్లించరాదని చైర్మన్ స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమ పథకాల అమలులో అధికారులు జాప్యం లేదా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని అన్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, యూనిఫామ్స్, పుస్తకాలు, మౌలిక వసతులు, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల మరమ్మతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న రైతు భరోసా, రైతు బీమా, పారిశుద్ధ్య కార్మికులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను శాఖల వారీగా అడిగి తెలుసుకున్న చైర్మన్, బ్యాక్‌లాగ్ ఖాళీలను త్వరితగతిన భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లాలో శాశ్వత అంగన్‌వాడీ భవనాలు లేని కేంద్రాలకు స్థలాలను గుర్తించి, భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ, భూ సేకరణలో అసైన్డ్ భూములు కోల్పోయిన ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లా పరిధిలో పరిష్కరించగలిగిన సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని, కమిషన్ చైర్మన్ సూచనలు, సలహాలను అమలు చేస్తామని తెలిపారు. జిల్లాలో అట్రాసిటీ కేసుల్లో 109 మంది బాధితులకు జనవరి 2026 నుంచి ఆగస్టు 31 వరకు రూ. 1.70 కోట్ల పరిహారం అందించామని తెలిపారు. వీరిలో 88 మంది ఎస్సీలు, 21 మంది ఎస్టీలు ఉన్నారని వివరించారు. మరో 119 పెండింగ్ అట్రాసిటీ కేసులకు సంబంధించి పరిహారం చెల్లించేందుకు అవసరమైన రూ. 1.82 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత సమయంలోపు చార్జిషీట్లు దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల నుంచి వివిధ సమస్యలపై రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య వినతులను స్వీకరించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాంబాబు నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరి దేవి, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ ఎన్నికల బరిలో మొగులోజు రాకేష్

**- అధికారికంగా నామినేషన్ దాఖలు**

**- ఉద్యోగ సంఘాల నేతలు, ఉన్నతాధికారుల సంపూర్ణ మద్దతు**

ప్రజా వాయిస్, కరీంనగర్( సెప్టెంబర్ 23 ): ప్రముఖ అంతర్జాతీయ సేవా సంస్థ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐ.ఆర్.సి.ఎస్) కరీంనగర్ జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి మొగులోజు రాకేష్ తన నామినేషన్ పత్రాలను అధికారికంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, సేవా దృక్పథంతో సమాజానికి మరింత విస్తృతంగా సేవలందించేందుకే తాను ఈ ఎన్నికల బరిలో నిలిచినట్లు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగుల గళాన్ని జిల్లా స్థాయి సేవా వేదికపై సగర్వంగా వినిపించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తోటి ఉద్యోగుల సహకారం, ఉద్యోగ సంఘాల ప్రోత్సాహం తనపై బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. నామినేషన్ దాఖలు సందర్భంగా తనకు మార్గదర్శనం చేసి, ఆశీస్సులు అందజేసిన జిల్లా పంచాయతీ అధికారి (డి.పి.ఓ), జెడ్.పి సీఈఓ, డి.ఆర్.డి.ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎంపీడీవోలు, ఎంపీఓలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని రాకేష్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించిన శ్రీ దారం శ్రీనివాస్ రెడ్డి (చైర్మన్, టి జి ఈ జే ఏ సి, కరీంనగర్ జిల్లా)శ్రీ సంగం లక్ష్మణరావు (కార్యదర్శి, టి ఎన్ జి ఓ ఎస్, కరీంనగర్)శ్రీ కేశవరెడ్డి (మాజీ చైర్మన్, ఐ ఆర్ సి ఎస్, కరీంనగర్)శ్రీ గోదారి అజయ్ (జిల్లా అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శుల సంఘం)రెడ్ క్రాస్ సొసైటీలో లైఫ్ మెంబర్‌షిప్ కలిగిన ఉద్యోగులు, సభ్యులు,



శ్రేయోభిలాషులందరూ తమ అమూల్యమైన మద్దతును అందించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# గత పదేళ్లలో వైటీపీఎస్ కు ఏం చేశారు..

**ప్లాంట్‌ను ఉత్పత్తిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు**

**ల్యాండ్ లూజర్లకు ఉద్యోగాలపై ప్రభుత్వం దృష్టి**

**ఆంధ్ర కాంట్రాక్టర్లను తీసుకొచ్చింది గత ప్రభుత్వమే**

**భూవ్యవహారాల ఆరోపణలపై ముందుగా సమాధానం చెప్పాలి**

**ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్.**

ప్రజా వాయిస్,మిర్యాలగూడ.
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో గత పదేళ్లలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. హాలియాలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో విద్యుత్ శాఖ మంత్రిగా ఉన్న జగదీశ్‌రెడ్డి వైటీపీఎస్ కు సంబంధించి తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన పనులపై వివరాలు వెల్లడించాలని శంకర్‌నాయక్ ప్రశ్నించారు. అప్పట్లో సమస్యలను పరిష్కరించకుండా ఇప్పుడు ప్లాంట్ వద్దకు వచ్చి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో వైటీపీఎస్ ను ఉత్పత్తిలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టిందని తెలిపారు. పర్యావరణ అనుమతులు, పబ్లిక్ హియరింగ్ తదితర అంశాలపై చర్యలు తీసుకుంటూ ప్లాంట్‌ను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. వైటీపీఎస్ కోసం భూములు కోల్పోయిన కుటుంబాల సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని శంకర్‌నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ లూజర్లకు ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని, పెండింగ్ ఉద్యోగాల విషయంలోనూ నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సరఫరాపైనా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జగదీశ్‌రెడ్డి వెంట ఉన్న ఏకలింగంపై వచ్చిన భూవ్యవహారాల ఆరోపణలను కూడా




శంకర్‌నాయక్ ప్రస్తావించారు. భూకబ్జా ఆరోపణలపై ముందుగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైటీపీఎస్ నిర్మాణం, కాంట్రాక్టులు, బొగ్గు సరఫరా అంశాల్లో గత ప్రభుత్వమే నిర్ణయాలు తీసుకుందని, ఆంధ్ర కాంట్రాక్టర్లను తీసుకొచ్చింది కూడా గత ప్రభుత్వమేనని పేర్కొన్నారు. వైటీపీఎస్ అభివృద్ధిని అడ్డుకోకుండా అందరూ సహకరించాలని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ కోరారు

# మానవ నియంత్రణలోనే ఏఐ ఉండేలా చూడాలి

వాషింగ్టన్, సెప్టెంబర్ 24 : కృత్రిమ మేధ(ఏఐ) మానవ నియంత్రణలోనే ఉండేలా, ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించేలా చైనా, అమెరికా చూడాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్‌తో వైట్ హౌస్‌లో జరిగిన సమావేశంలో ఏఐ అంశాన్ని ప్రస్తావించారు. గురువారం వైట్ హౌస్ గ్రాండ్ ఫోయర్‌లో ట్రంప్‌తో కలిసి మాట్లాడిన జిన్‌పింగ్ ఏఐ రంగంలో తమ రెండు దేశాలు అగ్రగాములుగా ఎదిగాయన్నారు. ఏఐ అభివృద్ధి ఎల్లప్పుడూ మానవ నియంత్రణలో ఉంటూ ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడేలా చూసుకోవాల్సిన బాధ్యత మనపైన ఉంది అని జిన్‌పింగ్ తెలిపారు.

ఆరోగ్యకర పోటీ ఉండాలి

అమెరికా, చైనా మధ్య ఉన్న విస్తృత పోటీకి పరిమితులు విధించాలని, ఆరోగ్యకరంగా పోటీ ఉండాలని జిన్‌పింగ్ అన్నారు. ఇరు దేశాల సైన్యాల మధ్య మరింత బలమైన సమన్వయం ఉండాలని చైనా అధినేత పిలుపునిచ్చారు. జిన్‌పింగ్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ పర్యటనలో భద్రత, సాంకేతికత, సూపర్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన అత్యవసర అంశాలపై కూడా మేము చర్చిస్తాము అని ట్రంప్ అన్నారు.



# భావోద్వేగాల సమ్మేళనంగా సిగ్మా

'ఇందులో రేడియో జాకీలా కనిపిస్తా. మంచి ఎమోషనల్ క్యారెక్టర్ నాది. అన్ని రకాల ఎమోషన్స్‌నీ ఇందులో ప్రజెంట్ చేశాను. మంచి యాక్షన్ అడ్వెంచర్ కామెడీ సినిమా ఇది. ఫ్యామిలీతో కలిసి హాయిగా చూడొచ్చు' అని ఫరియా అబ్దుల్లా అన్నారు. సందీప్‌కిషన్ కథానాయకుడిగా జేసన్ సంజయ్ దర్శకత్వంలో రూపొందిన 'సిగ్మా' చిత్రంలో ఫరియా కథానాయిక. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించిన ఈచిత్రం అక్టోబర్ 2న విడుదల కానున్నది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఫరియా అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'సందీప్‌కిషన్, నేనూ కలిసి ఎప్పట్నుంచో ఓ సినిమా చేయాలనుకుంటున్నాం. ఫైనల్‌గా సిగ్మాతో కుదిరింది.జూమ్ కాల్‌లో జేసన్ ఈ కథ చెప్పారు. కథ విన్న తర్వాత ఆయన్ను 'వయసెంత?' అనడిగాను. 24ఏళ్లని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. ఒక సూపర్‌స్టార్ కొడుకు అనే ఫీలింగ్ ఆయనలో మచ్చుకైనా కనిపించదు. వినయంగా, ఫ్రెండ్లీగా ఉంటారు. తొలి సినిమా అయినప్పటికీ ఎంతో క్లారిటీగా, విజన్‌తో సినిమా తీశారు' అని తెలిపింది ఫరియా అబ్దుల్లా. 'సిగ్మా' లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళంలో ఎంట్రీ ఇవ్వడం ఆనందంగా ఉందని, తమన్ బీజీఎం, పాటలు నెక్స్ట్ లెవెల్లో ఉంటాయని ఫరియా పేర్కొన్నది.



# ఆసీస్ లక్ష్యం 363

పుదుచ్చేరి : భారత్, ఆస్ట్రేలియా-ఏ జట్ల మధ్య జరుగుతున్న అనధికారిక తొలి టెస్టులో భారత-ఏ జట్టు ప్రత్యర్థి ఎదుట 363 పరుగుల భారీ లక్ష్యాన్ని నిలిపింది. తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకున్న భారత్.. రెండో ఇన్నింగ్స్‌లో 199కే ఆలౌట్ అయింది.కెప్టెన్ దేవ్‌దత్ పడిక్కల్ (59), కుశాగ్ర (46 నాటౌట్) ఆదుకున్నారు. సెకండ్ ఇన్నింగ్స్‌కు వచ్చిన ఆస్ట్రేలియా-ఏ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 2 వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది.



# భారత జట్లకు డ్రా

సమర్‌కండ్ : చెస్ ఒలింపియాడ్‌లో భారత జట్లు తొలి డ్రా ఎదుర్కొన్నాయి. గురువారం జరిగిన ఎనిమిదో రౌండ్‌లో పురుషుల, మహిళల జట్ల మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. ఓపెన్ సెక్షన్‌లో అబ్బాయిలు 2-2తో అజర్‌బైజాన్‌తో సమంగా నిలిచారు.అర్జున్, ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ నలుగురి గేమ్స్ డ్రాగా ముగిశాయి. అమ్మాయిల జట్టుకు యువ క్రీడాకారిణి సవిత శ్రీ ఓటమి తప్పించింది. నాలుగో బోర్డులో ఆడిన సవిత.. ఎల్నాజ్‌కు చెక్ పెట్టడంతో కజకిస్థాన్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నారు. ఈ టోర్నీలో సవితకు ఇది ఏడో విజయం కావడం విశేషం.



# SPORTS

## తొలి వన్డేలో సఫారీల గెలుపు



దర్బన్ : దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా ఓటమితో ఆరంభించింది. దర్బన్ వేదికగా ఇరుజట్ల మధ్య జరిగిన తొలి వన్డేలో ఆతిథ్య సఫారీ జట్టు.. 67 పరుగుల తేడాతో కంగారూలను ఓడించి మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 297/8 స్కోరు చేసింది.మాథ్యూ బ్రీట్జె (112) శతకంతో రెచ్చిపోగా ఆఖర్లో మార్కో యాన్సెన్ (75) మెరుపులు మెరిపించాడు. ఛేదనలో ఆసీస్ 41.2 ఓవర్లకు 230 రన్స్‌కే కుప్పకూలింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (60), మాథ్యూ రెన్‌షా (44) పోరాడారు.